

దర్శింపండి - తరింపండి

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం

కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.

సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి

శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్

A/c No. 30178925930, IFSC No. SBIN0010105

మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 121 | ది. 13-8-2026 | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 121 | Date : 13-8-2026 | Thursday | Pages : 8 | Rs.1/- |


## అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్ కుమార్ దంపతులు



**విజయవాడ,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్ కుమార్ గేదెల తన వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. వివాహ దినోత్సవం సందర్భంగా ఆయన తన సతీమణితో కలిసి ఆలయానికి విచ్చేశారు. ఆలయ మర్యాదల ప్రకారం అర్చకులు, అధికారులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ తుహిన్ కుమార్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# డిసెంబరు నుంచి ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

- గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందేలా పారిశ్రామిక ప్రాజెక్టులు
- రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న డిఫెన్స్ ప్రాజెక్టులు జాతికి గర్వకారణం
- గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ లాంటి రంగాలపై దృష్టి
- రూ.2,08,406 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీలో ఆమోదం
- వివిధ ప్రాజెక్టుల ద్వారా 21,627 మందికి ఉద్యోగాల కల్పన
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం



**అమరావతి, ఆగష్టు 12 (వార్తాప్రభ) :** ఈ ఏడాది డిసెంబరు నుంచి పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాలో వేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించేందుకు ఎస్క్రో ఖాతాలను అనుసంధానించాలని సీఎం సూచించారు. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఇన్సెంటివ్‌లు తప్పనిసరి అయినా ఎంత వరకూ ఆ ప్రోత్సాహకాలను ఇవ్వగలమన్న అంశంపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందేలా పారిశ్రామిక ప్రాజెక్టులను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం అయ్యింది. పరిశ్రమలు, ఇంధనం, ఐటీ ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో మొత్తం 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదాన్ని తెలియచేసింది. తద్వారా 21,627 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలను కల్పించనున్నారు. ఇప్పటి వరకూ జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా 363 ప్రతిపాదనల ద్వారా రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం దక్కింది. ఈ పెట్టుబడుల ద్వారా 10.86 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. గ్రీన్ అమ్మోనియాతో పాటు లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ రంగాల్లో పెట్టుబడులపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ రంగంలో పరిశ్రమల్ని ప్రోత్సహించేలా ఏం చేయాలన్న దానిపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు అవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుల గురించి ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. కొందరు పనిగట్టుకుని కాలుష్యకారకా లంటూ దుష్ప్రచారం చేస్తున్నారని అసత్యాలను నమ్మించి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటు అవుతున్న డేటా సెంటర్లన్నిటికీ 3.5 టీఎంసీల నీరు సరిపోతుందని అన్నారు. డేటా సెంటర్లపై ఉన్న అపోహలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు. కొందరు రాజకీయ నిరుద్యోగులు సామాజిక మాధ్యమాల ద్వారా ఫేక్ ప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీపై విశాఖలోని పరిశ్రమలకు పుష్కలంగా నీటిని తీసుకెళ్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వస్తున్న పరిశ్రమల ద్వారా రాష్ట్రంలోని ఎకోసిస్టమ్‌కు ఎంత విలువ జోడిస్తున్నామన్న అంశాన్ని విశ్లేషించాలని సీఎం సూచించారు. ఏపీకి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా ఆతిథ్య రంగంలో వస్తున్న హోటల్ భవనాలు ప్రత్యేక నిర్మాణాలుగా ఉండేట్టు చూడాలని అన్నారు.

## మిల్లర్ల నుంచి బకాయిలు వసూలు చేయాల్సిందే...

- బకాయిల వసూలుకు విధివిధానాల రూపకల్పన
- ధాన్యం నిల్వకు అయిదు నియోజకవర్గాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలు
- పౌరసరఫరాల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని సీఎం హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బుధవారం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలకు అవకాశం ఇచ్చి.. తిరిగి ఆ తప్పిదాన్ని తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు చెందిన బకాయిని వసూలు చేయాల్సిందేనన్నారు. బకాయిల వసూలుకు సంబంధించి విధివిధానాల రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సీఎం సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలను పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల (గాన+) ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని సీఎం తెలియజేశారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# 'మన సభ -- జన సభ'

## అమరావతి అసెంబ్లీలో ప్రజలతో కలిసి స్వాతంత్ర్య సంబరాలు

- ఇకపై ప్రతి ఏటా 4రోజుల పాటు సామాన్యులకు సైతం అసెంబ్లీ సందర్శన
- ఆగస్టు 15, జనవరి 26 వేడుకల నిర్వహణకు సామాన్యులకు ఆహ్వానం
- ఆగస్టు 14, 15 తేదీల్లో సాయంత్రం వేళల్లో ప్రజలు,విద్యార్థుల సందర్శనకు పిలుపు
- రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు



**అమరావతి,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** రాష్ట్ర శాసన సభ చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టానికి శ్రీకారం చుడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజా పండుగలా నిర్వహించేందుకు అమరావతి అసెంబ్లీ ప్రాంగణం సిద్ధమౌతోంది.కేవలం విద్యుత్ దీపాల అలంకరణలు,అధికారుల జెండా వందనానికే పరిమితం కాకుండా సామాన్య ప్రజలను,విద్యార్థులను భాగస్వాములను చేయాలని శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన నిర్ణయం తీసుకున్నారు.గతంలో మాజీ సియం నందమూరి తారకరామారావు తరచూ చెప్పే"మన సభ-జన సభ" అనే స్ఫూర్తితో అసెంబ్లీ గేట్లను ప్రజల కోసం తెరవనున్నట్లు ఆయన ప్రకటించారు.ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలోని తన కార్యాయలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 14,15 తేదీలలో సాయంత్రం వేళల్లో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు సకుటుంబంగా వచ్చి అసెంబ్లీ విద్యుత్ కాంతులను వీక్షించవచ్చని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సాయంత్రం వేళల్లో ప్రత్యేక పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలు, స్వాతంత్ర్య పోరాట త్యాగాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.నేటి తరం పిల్లల తోపాటు భావితరాలకు దేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర,దేశ ఔన్నత్యం గురించి తెలియాలనే ఉద్దేశంతో విద్యార్థులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామని, వీలును బట్టి వారిని అసెంబ్లీ మెయిన్ హాల్ సందర్శనకు కూడా అనుమతిస్తామని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అసెంబ్లీ సందర్శనలో భాగంగా పరిమితంగా ఆన్ పేమెంట్ ప్రాతిపదికన ఫుడ్ కోర్టులు సైతం ఏర్పాటుకు అనుమతి ఇచ్చామని తెలిపారు. అయితే ప్రాంగణంలో ఫోన్లతో రీల్స్ చేయడం వంటి వాటిపై భద్రతా కారణాల దృష్ట్యా కొన్ని నిబంధనలు విధిస్తామన్నారు. ఈనెల 17 నుండి మొదలయ్యే అసెంబ్లీ సమావేశాలను సజావుగా ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలపై ఈనెల 14వతేది ఉదయం సిఎస్ సహా ఇతర కార్యదర్శులు,డిజిపి సహా పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్టు శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు మీడియాకు వివరించారు.

**అసెంబ్లీకి రాని వారికి జీతం ఎందుకు? కేంద్రం దీనిపై చట్టం తేవాలి:స్పీకర్ అభిప్రాయం..** శాసనసభ సమావేశాలకు హాజరుకాని ప్రజా ప్రతినిధుల వైఖరిపై శాసన సభాపతి సిహెచ్.అయ్యన్నపాత్రుడు అసంతృప్తి వ్యక్తం చేశారు.సాధారణ ఉద్యోగి విధులకు వెళ్లకపోతే ఆసంస్థ లేదా కంపెనీ జీతం ఇవ్వదని, ప్రజల సమస్యలు చర్చించడమే ప్రాథమిక విధిగా ఉన్న ఎమ్మెల్యేలు సభకు రాకుండా వేతనాలు,భత్యాలు ఎలా డిమాండ్ చేస్తారని ప్రశ్నించారు. గతంలో సభకు రాకుండా నాలుగైదు రోజుల తర్వాత వచ్చి సంతకాలు చేసే దొంగ పద్ధతి ఉండేదని దానికి స్వస్తి పలుకుతూ తమ హయాంలో 'డిజిటల్ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్' విధానం అమలులోకి తెస్తున్నామన్నారు.సభ్యులు కేటాయించిన సీట్లో కూర్చుంటేనే హాజరు పడుతుందన్నారు.

# ఉప్పాడ తీర రక్షణకు ఐఐటీ-మద్రాస్‌తో ఎం.ఓ.యు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో ఒప్పందం
- రక్షణ గోడ డిజైన్, డీపీఆర్, పర్యవేక్షణ బాధ్యతలు చూడనున్న ఐఐటీ మద్రాస్
- నవంబర్ నుంచి పనులకు శ్రీకారం
- రూ.323 కోట్లతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం



**విజయవాడ,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** సముద్ర కోతతో తీవ్రంగా దెబ్బ తింటున్న ఉప్పాడ తీర ప్రాంత పరిరక్షణకు కీలక ముందడుగు పడింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్), సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను ఐఐటీ - మద్రాస్‌కు అప్పగిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదిరింది. రూ.323 కోట్లతో ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం కానుంది. కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి (ఎన్.డి.ఎమ్.ఎఫ్) ఆమోదంతో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్.డి.ఎమ్.ఏ.) నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో అమలు చేసే ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపీ మారిటైమ్ బోర్డు బాధ్యతలు నిర్వహించనుంది. ఐఐటీ మద్రాస్ నిపుణుల సాంకేతిక సూచనలు, శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా ఉప్పాడ తీర ప్రాంతానికి అనువైన రక్షణ చర్యలను రూపొందించనున్నారు. తీర కోత తీవ్రత, సముద్ర ప్రవాహాలు, అలల ప్రభావం తదితర అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా తీర రక్షణ నిర్మాణాల డిజైన్‌ను సిద్ధం చేయనున్నారు.

**నవంబర్ నుంచి పనులు ప్రారంభం..** ఐఐటీ మద్రాస్‌తో అధికారిక ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ పూర్తికావడంతో, రానున్న నవంబర్ నుంచి ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు, మత్స్యకార గ్రామాల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ ఎమ్.ఎన్.హరేంధిర ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ శరవణన్, పాడా డైరెక్టర్ డా. ఎన్.వి. శివరామ ప్రసాద్, ఐఐటీ మద్రాస్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఎ.సన్నాసిరాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్ చీఫ్ ఇంజనీర్ జి.వి.రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు.. నాణేనికి మరో వైపు చూపిస్తా: జగన్



**అమరావతి, ఆగష్టు 12 (వార్తాప్రభ) :** ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తమ గొంతు నొక్కేందుకే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. శాసనసభను దాదాపు రెండేళ్లుగా బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలి వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం నాడు ఆయన పార్టీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన పార్టీ అయిన వైసీపీకి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం ఇష్టపడటం లేదని, అందుకే ప్రజా సమస్యలను మీడియా ద్వారానే ప్రజల దృష్టికి తీసుకెళ్లి నాణేనికి మరోవైపు చూపిస్తానని స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీకి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రజావాణిని బలంగా వినిపించాలని జగన్ సూచించారు. "గత 74 రోజులుగా డీఎస్సీ కుంభకోణంపై 10 రకాల నిరసనలు చేపట్టాం. పేపర్ లీకేజీ, ఔట్‌సోర్సింగ్ కుంభకోణాలు, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు, ప్రభుత్వ ఉత్తర్వుల మార్పు వంటి అంశాలను ఆధారాలతో సహా బయటపెట్టాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశాం" అని జగన్ వివరించారు.

## పబ్లిక్ నోటీసు

నా క్లయింటు కానూరు గ్రామ కాపురస్థుడు వీర్ల వెంకటేశ్వరరావు గారి కుమారుడు వీర్ల సాయిసందీప్ గారి సంజాయిషీ మేర ఇచ్చు ప్రకటన ఏమనగా... నాక్లయింటు యీదిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని కర్ణాటక రాష్ట్రం Davangere జిల్లా, 2వ స్టేజ్, డోర్ నెం. 515/8,విద్యానగర (P.O) కాపురస్థులు నర్రా ఆంజనేయ చౌదరి గారి కుమారుడు నర్రా కృష్ణా రావు గారి వద్దనుండి కొనుగోలు చేయు నిమిత్తమై ఒప్పందం కుదుర్చు కొని యున్నారు. సదరు ఆస్తి నర్రా కృష్ణా రావు గారు మరియు వీరి అన్నదమ్ములు కలిసి రిజిస్టర్డు దస్తావేజు నెం. 1731/1971రు ద్వారా 1971సం.లో పార్టీషన్ చేసుకొనియున్నారు. దర్మిలా వీరి తండ్రి గారైన ఆంజనేయ చౌదరి గారు తనకు గల మరికొంత ఆస్తిని రిజిస్టర్డు వీలునామా నెం. 4/2017రు ద్వారా 2017సం.తన కుమారులైన నర్రా కృష్ణారావు వగైరాలకు సంక్రమింపజేసిన తదుపరి సదరు కృష్ణారావు గారి అన్నదమ్ములు అందరూ కలిసి కృష్ణారావు గార్కి పవర్ ఆఫ్ ఆటార్నీ ఇచ్చియున్నారు. కావున అట్టిఆస్థి పై ఎవరికైనా వారసత్వపు హక్కులు గానీ, ఇతరత్రా ఏవిధమైన లావాదేవీలు గానీ, క్లయిములు గానీ వున్న యెడల 7 రోజుల లోపు వ్రాత పూర్వకముగా తెలుపగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములు పరిగణలోకి తీసుకొనబడవు.

**షెడ్యూలు :**

కృష్ణా జిల్లా,పామర్రు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, పామర్రు మండలం, జమీగొల్వేపల్లి గ్రామ ఏరియా R.S. No. 40-6రు, R.S. No. 42-1రు నందు గలమొత్తం య. 1.97 సెంట్లు మాగాణి భూమికి గల హద్దులు : **తూర్పు :** నర్రా అంజనీ దేవి వగైరాలు, **పడమర :** కాట్రగడ్డ లీలా గోవర్ధనరావు , **దక్షిణం :** పెద్దు ధనుంజయ , **ఉత్తరం :** కాట్రగడ్డ రమేష్

**శ్రీపతి బాల సుబ్రహ్మణ్యం,** న్యాయవాది

**సెల్ : 9505027579. మచిలీపట్నం, ది.12.08.2026**

## పబ్లిక్ నోటీసు

నా క్లయింటు కానూరు గ్రామ కాపురస్థుడు వీర్ల వెంకటేశ్వరరావు గారి కుమారుడు వీర్ల జయచంద్ గారి సంజాయిషీ మేర ఇచ్చు ప్రకటన ఏమనగా... నాక్లయింటు యీదిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని కర్ణాటక రాష్ట్రం Davangere జిల్లా, 2వ స్టేజ్, డోర్ నెం. 515/8,విద్యానగర (P.O) కాపురస్థులు నర్రా ఆంజనేయ చౌదరి గారి కుమారుడు నర్రా కృష్ణారావు గారి వద్దనుండి కొనుగోలు చేయు నిమిత్తమై ఒప్పందం కుదుర్చు కొనియున్నారు. సదరు ఆస్తి నర్రా కృష్ణారావు గారు మరియు వీరి అన్నదమ్ములు కలిసి రిజిస్టర్డు దస్తావేజు నెం. 1731/1971రు ద్వారా 1971సం.లో పార్టీషన్ చేసుకొని యున్నారు. దర్మిలా వీరి తండ్రి గారైన ఆంజనేయ చౌదరి గారు తనకు గల మరికొంత ఆస్తిని రిజిస్టర్డు వీలునామా నెం. 4/2017రు ద్వారా 2017సం.తన కుమారులైన నర్రా కృష్ణారావు వగైరాలకు సంక్రమింపజేసిన తదుపరి సదరు కృష్ణారావు గారి అన్నదమ్ములు అందరూ కలిసి కృష్ణారావు గార్కి పవర్ ఆఫ్ ఆటార్నీ ఇచ్చియున్నారు. కావున అట్టిఆస్థి పై ఎవరికైనా వారసత్వపు హక్కులు గానీ, ఇతరత్రా ఏవిధమైన లావాదేవీలు గానీ, క్లయిములు గానీ వున్న యెడల 7 రోజుల లోపు వ్రాత పూర్వకముగా తెలుపగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములు పరిగణలోకి తీసుకొనబడవు.

**షెడ్యూలు :**

కృష్ణా జిల్లా,పామర్రు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, పామర్రు మండలం, జమీగొల్వేపల్లి గ్రామ ఏరియా R.S. No. 40-1రు, R.S. No. 40-5రు నందు గల మొత్తం య. 2.02 సెంట్లు మాగాణి భూమికి గల హద్దులు : **తూర్పు :** నర్రా అంజనీ దేవి వగైరాలు , **పడమర :** కాట్రగడ్డ లీలా గోవర్ధనరావు , **దక్షిణం :** వల్లభనేని రమేష్ , **ఉత్తరం :** కాట్రగడ్డ రమేష్

**శ్రీపతి బాల సుబ్రహ్మణ్యం,** న్యాయవాది

**సెల్ : 9505027579. మచిలీపట్నం, ది.12.08.2026**

## మాషా అల్లా సిఈవో అంకుశంకు రిమాండ్

**విజయవాడ లీగల్,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** స్క్రబ్బర్స్ తయారీ మిషన్లలో పెట్టుబడుల పేరుతో భారీగా మోసం చేసిన కేసులో మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ సిఈవో పసుపులేటి అంకుశంకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీచేశారు. వివరాల్లోకి వెళితే... ఇంటి వద్ద నుండే మహిళలు, నిరుద్యోగులు మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ ద్వారా గ్రీన్ మ్యాట్ రా మెటీరియల్‌ను తీసుకొని, వారిచ్చే స్క్రబ్బింగ్ మిషన్ల ద్వారా స్క్రబ్ చేసి వాటిని తిరిగి ఆ కంపెనీకి ఇచ్చే ఒప్పందంతో మిషనరీ కొరకు లక్ష రూపాయలు, రా మెటీరియల్ కొరకు 30వేలు డిపాజిట్ చేయాలన్నారు. నెలకు రెండుసార్లుగా 24వేలు ఆదాయం వస్తుందని నమ్మబలికారు. దీనిని సోషల్ మీడియా ద్వారా, ఏజెంట్ల ద్వారా విస్తృత ప్రచారం చేశారు. అంతేకాకుండా డ్రై ఫ్రూట్స్‌ను ఇచ్చి, వాటిని ప్యాకింగ్ చేసి మరలా కంపెనీ వారికి ఇచ్చే వేరొక వ్యాపారం కూడా సోషల్ మీడియా ద్వారా ప్రజల లోకి తెచ్చారు. దీంతో ఆంధ్రా, తెలంగాణాలో షుమారు 4 వేల మందికిపైగా డిపాజిట్‌గా కంపెనీకి చెల్లించారు. వారి నమ్మకాన్ని వమ్ముచేస్తూ 100 కోట్లకు పైగా డిపాజిట్లను సేకరించి, కంపెనీని మూసివేసి పరారవ్వడంతో రెండు రాష్ట్రాలలోని బాధితులు సత్యనారాయణపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో పసుపులేటి అంకుశం బుధవారం న్యాయస్థానంలో లొంగిపోయాడు. విచారణ అనంతరం న్యాయమూర్తి రిమాండ్ విధిస్తూ, విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

## కాదంబరీ జత్వాని కేసులో విద్యాసాగర్ కోర్టుకు హాజరు

**విజయవాడ లీగల్,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** కాదంబరి జత్వాని కేసులో ఆమె సోదరుడు, తల్లిదండ్రుల పేర్లను తొలగిస్తూ సిఐడి పోలీసులు ఛార్జిషీటు నమోదుచేశారు. ఆ ఛార్జిషీటులో వారి పేర్లను తొలగించడంపై కుక్కల విద్యాసాగర్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయవాదులతో కలసి బుధవారం 3వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో హాజరయ్యారు. విద్యాసాగర్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు వసూలు చేయడంలో జత్వాని తల్లిదండ్రులు, సోదరుని పాత్ర ఉందని, కొంత సొమ్మును జత్వాని తల్లి అకౌంట్‌కు బదిలీ చేశానని, కొన్నిసార్లు జత్వాని చెప్పినట్లు చేయకపోతే ఇబ్బందిపడతావని నన్ను బెదిరించారని విద్యాసాగర్ అభ్యంతరాలలో పేర్కొన్నారు. అంతేకాక దుబాయ్‌లో ఉన్న ఆమె సోదరుడు అంబరీష్‌కు నేరగాళ్లతో సంబంధం ఉందని బెదిరించారని పేర్కొన్నారు. అందుచేత ముగ్గురిని కేసు నుండి తీసేందుకు అనుమతించవద్దని పేర్కొన్నారు. న్యాయమూర్తి విచారణ కోసం ఈనెల 19వ తేదీకి వాయిదా వేశారు.

## ఈ నెల 17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం




**మైలవరం,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** స్థానిక మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల అనగా 17 ఆగస్టు 2026వ తేదీ సోమ వారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మౌనిక తెలిపారు.ఎంపీపీ ఇస్లావతు ప్రసన్న రాణి అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశం ఉదయం 10.00 గంటలకు ప్రారంభమవుతుందని తెలియజేశారు.ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు,అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

## భవిష్యత్తు ఆలోచనతో ముందుకు వస్తున్న బీమా కంపెనీలు



**విస్సన్నపేట,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** వాహన యజమానులు పార్టీ ఇన్సూరెన్స్ లేకపోతే వాహనాలలో పెట్రోల్ పోసే పరిస్థితి ఉండకూడదని ఆ విధంగా పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించాలని జస్టిస్ సంజయ్ కరోల్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ ధర్మాసీ దిశా నిర్దేశం చేయడం జరిగింది. వారి లక్ష్యాలకు అనుగుణంగా వన్ స్టాప్ మల్టిపుల్ కంపెనీస్ జన్ ఫ్యూచర్ విజన్స్ సంస్థ ముందుకు రావడం జరిగింది. లైఫ్ హెల్త్ మరియు మోటార్స్ బీమా సేవలను అందించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలను వేదికగా చేసుకోవడం వాహనదారులకు అమృత కలశంగా మారింది అని చెప్పవచ్చు. లైఫ్ హెల్త్ మరియు జనరల్ ఇన్సూరెన్స్ లతో పాటు ట్రావెల్, హోం,షాప్, ఇండస్ట్రియల్ గ్రూప్,పి ఏ, బైక్, కార్, ఆటో,వ్యాన్ తదితర భీమాలను ఒకే గొడుగు క్రింద అందించేందుకు ముందుకు వచ్చినట్లు నిర్వాహకులు మీడియా సమావేశంలో తెలియజేశారు. ఈ సువర్ణ అవకాశాన్ని సకల జనులు వినియోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## రక్తదానం అన్ని దానాలను మించి మహోన్నత దానం

● వికాస్ విద్యా సంస్థల అధినేత లయన్ నరెడ్ల నర్సిరెడ్డి




**విస్సన్నపేట,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** స్థానిక వికాస్ ఫార్మసీ కాలేజి ప్రాంగణంలో చిగురుపాటి మంజువాణి వరప్రసాద్ లయన్ జిల్లా బ్లడ్ బ్యాంక్ విసన్నపేట లయన్స్ క్లబ్ సంయుక్త సహకారంతో ఏర్పాటైన బ్లడ్ బ్యాంకు శిబిరమును వికాస్ అధినేత ఎన్ నర్సిరెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథి లయన్ పివి హనుమంతరావు, గౌరవ అతిధులు లయన్ డాక్టర్ ఎన్టీ వెంకటేశ్వరరావు, విస్సన్నపేట లయన్స్ అధ్యక్షులు డాక్టర్ ఎం శ్రీనివాసరావు, కార్యదర్శి సిజెడబ్ల్యూకే (జాన్) బాబు, కోశాధికారి జువ్వా అప్పారావు, లయన్స్ సభ్యులు ముంగా జయరాజ్ పి లక్ష్మయ్య వెంకటరెడ్డి జె రాజేంద్రప్రసాద్ బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లా స్కూల్ లో రెండోరోజు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం



**పెడన,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** అంగన్వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి సెక్షన్-2,రెండో రోజు శిక్షణా కార్యక్రమం పెడన పట్టణంలోని స్థానిక బంగ్లా స్కూల్ లో బుధవారం జరిగింది.రిమోట్ లెర్నింగ్ మెసేజ్(ఆర్ఎల్ఎమ్),పిల్లల సర్వతోముఖాభివృద్ధి కోసం,రోజువారీ అంగన్వాడీ కార్యక్రమంలో మెసేజ్ గ్రూపులు ఏర్పాటు చేయుట,తల్లుల గ్రూపులు ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించాలని శిక్షణ ఇచ్చారు.ఈ శిక్షణలో భాగంగా టీచర్లను 5 గ్రూపులుగా చేసి 4 కార్నర్ గురించి వివరించి పిల్లలను ఎలా ఆడించాలి,ప్రీస్కూల్ మెటీరియల్ ఎలా సంసిద్ధత పరచాలి తదితర అంశాలకు శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ బంటుమిల్లి-పెడన సీడీపీఓ సముద్రవేణి,పెడన ఎమ్ఇఓ1 సలోమి,ఎమ్ఇఓ2 హరినాథ్ డిఆర్డి శిక్షకులు శివరామకృష్ణ సత్యనారాయణ,ఐసిడిఎస్ సూపర్వైజర్ కల్పవల్లి అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కోకో పోటీలకు ఎంపికైన మారుతి విద్యార్థిని..బెల్లంకొండ దివ్య



**కోడూరు,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** రాష్ట్రస్థాయి కోకో పోటీలకు కోడూరు మారుతి కళాశాలకు చెందిన బెల్లంకొండ దివ్య ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జేవిఎస్ఎస్ మూర్తి తెలిపారు.ఇటీవల గుడివాడ కేకేఆర్ గౌతమ్ స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 17 కోకో పోటీలలో బెల్లంకొండ దివ్య అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనదన్నారు. విద్యార్థినిని మారుతి అధ్యాపక బృందం, విద్యార్థిని తల్లిదండ్రులు అభినందించారు.

# జర్నలిస్టులందరికీ ఇళ్లు.. అందరికీ గుర్తింపు!

● అదే ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం లక్ష్యం

● ఏపీజేఎఫ్ సంఘం ఫౌండర్, గౌరవాధ్యక్షుడు కృష్ణాశీజనేయులు, రాష్ట్ర అధ్యక్షుడు శివ రాజేష్




**విశాఖపట్నం,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** ఏపీలో పని చేస్తున్న జర్నలిస్టు లందరికీ ఇళ్లు, గుర్తింపు లభించేందుకు కృషి చేయడమే ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం (ఏపీజేఎఫ్) ఫౌండర్ ప్రెసిడెంట్, గౌరవాధ్యక్షులు చెవుల కృష్ణాశీజనేయులు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల్ని ప్రభు త్వాల దృష్టికి తీసుకు వెళ్లి 2015నుంచి పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తున్నది తమ సంఘమేనన్నారు. నగరంలోని ఒక హోటల్ లో ఏపీజేఎఫ్ మహా సభ సన్నాహక కార్యక్రమాలకు సంబంధించి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ఇళ్ల స్థలాల కేటాయింపు, నిర్మాణం విషయంలో ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళామని, ఇప్పటికీ అక్రిడేషన్ కార్డులు రాని వారికి, సాంకేతిక తప్పిదాలుంటే త్వరలోనే వారందరికీ వచ్చేలా చేస్తామన్నారు. అదే విధంగా రైల్వే పాస్ లకు సంబంధించి కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళామని, ఇదే విషయమై త్వరలో కేంద్ర మంత్రిని కూడా కలవనున్నామని స్పష్టం చేశారు. ఏపీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు శివ రాజేష్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల్ని నిత్యశీ ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్తున్న ఏకైక సంఘం తమదేనని, వ్యక్తిగత లబ్ది తమ ధ్యేయం కాదన్నారు. సంఘం మహా సభ అడహక్ కమిటీ కన్వీనర్లుగా సీనియర్ జర్నలిస్టు బి.రవికాంత్, పీపీ రావు, వై.నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, యూసఫ్ లను ప్రకటించారు. త్వరలో జిల్లా కమిటీ పేర్లను ప్రకటిస్తామన్నారు. సీనియర్ జర్నలిస్టు రవికాంత్ మాట్లాడుతూ మహాసభ విజయవంతానికి జర్నలిస్టులంతా సహకారం అందించాలని కోరారు.

# విపక్షంపై విరుచుకుపడ్డ టిడిపి పెద్దలు





**విస్సన్నపేట,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** స్థానిక మండల టిడిపి సర్వసభ్య సమావేశం రాయల సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. బుధవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో పలు గ్రామాల గ్రామ పార్టీల అధ్యక్షులు సీనియర్ నాయకులు మాజీ మండల పార్టీ అధ్యక్షులు మట్టా వేణుగోపాలరావు, ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షులు టిడిపి సీనియర్ నాయకులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, క్లస్టర్ విసన్నపేట ఇంచార్జ్ శ్రీనివాసరావునెక్కలపు (దాబా శ్రీను), రాష్ట్ర కొర్లమండ కే రాజా, ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళ కార్యనిర్వాక కార్యదర్శి నాదెళ్ల నాగమ-ణి, మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు సంబరం నాగలక్ష్మి, పట్టణ టిడిపి అభ్యర్థులు కొంగల శ్రీనివాసరావు, సహకార సంఘం అధ్యక్షుడు కే బద్రీనాథ్, కలగర సీనియర్ నాయకులు పుట్రెల గ్రామ పార్టీ అధ్యక్షులు అరిగే శ్రీనివాసరావు, మారెమ్మ దేవాలయం చైర్మన్ అందరికి టి శ్రీనివాసరావు, కలగర సీనియర్ నాయకులు గరిమెళ్ళ భాస్కరరావు, లలితా రామకృష్ణ, ముత్తం శెట్టి వంశీకృష్ణ, తాత కుంట్ల గ్రామ పార్టీ అధ్యక్షులు పులపాక శ్రీనివాసరావు, తెల్లదేవర పల్లి సహకార సంఘం అధ్యక్షులు వీరమాచినేని కృష్ణ ప్రసాద్, రంగారావు రాజశేఖర్ వడ్లమూడి పద్మారావు పల్లెపాశీ రాంబాబు, వడ్లమూడి మాధవరావు మాజీ సర్పంచ్ మారెమండ నందమూరి శ్రీరామచంద్ర, భూక్య వెంకటేశ్వరరావు, రామినేని రామారావు, గిరిజన నాయకుడు అశోక్ తదితరులు పాలొ న్నారు. డీఎస్సీ కి సంబంధించి ధర్నా అంటారు తమకు అన్యాయం జరిగిందని చెప్పే అభ్యర్థి ఒకరు ఉండరని అందరూ సృష్టి ప్లస్ నాయకు లే ఉంటారని టిడిపి పెద్దలు దుయ్యబట్టారు. అధికారులు కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు దాటిన ఇంకా వైసిపి ప్రభుత్వమే అన్న భ్రమలో ఉన్నారన్నారు. ఇంటి నిర్మాణాలకు మెరువా మట్టికి సైతం స్వపక్షంలో విపక్షశీ అన్న చందంగా అధికారులకు ఫిర్యాదు చేయడం దురదృష్టకర మని కొర్లమండ కే రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షులు రాయల సుబ్బారావు మాట్లాడుతూ సుదీర్ఘ కాలం టిడిపి పార్టీలో పనిచేసిన ప్రస్తుత తిరువూరు నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ నల్లగట్ల స్వామి దాస్ విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని ప్రెస్ మీట్ లు పెట్టడం విడ్డూరంగా ఉన్నది అన్నారు. మండల టిడిపి మాజీ అధ్యక్షులు మట్టా వేణుగోపాలరావు మాట్లాడుతూ సొంత ఇంటి కలల సహకారానికి తెలుగింటి ఆడపడుచులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారని మండలంలో 2000కు పైగా దరఖాస్తుదారులు ఇల్లు నిర్మించుకునేందుకు ఎదురుచూస్తున్నారని అందరికీ ఇంటి నిర్మాణాలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. మారెమండ మాజీ గ్రామ సర్పంచ్ నందమూరి శ్రీరామచంద్ర మాట్లాడుతూ ఎన్నిక ఏదైనా గెలుపు సునాయాసం కాదని సమిష్టి కృషితోనే గెలుపు సాధ్యమన్నారు. ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు మాట్లాడుతూ జగన్ అంటే క్రిమినల్ మైండ్ అని తన పరిపాలనలో అమరావతిలో ఎలాంటి అభివృద్ధి చేయకుండా ప్రస్తుతం చంద్రబాబు నాయుడు తన సారథ్యంలో ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ఉరు కులు పెట్టిస్తూ అదే సమయంలో జట్ స్పీడ్ తో అమరావతిని అభివృద్ధి చేస్తుంటే చూచి ఓర్వలేక మచిలీపట్నం విజయవాడ గుంటూరు అంటూ మావిగాన్ పేరుతో నాన యాగి చేయటం విచిత్రంగా ఉన్నదన్నారు. విసన్నపేట క్లస్టర్ ఇంచార్జ్ శ్రీనివాసరావు( దాబా శ్రీను ) మాట్లాడుతూ సమస్య వచ్చినప్పుడు ఈగోలకు పోకుండా సమిష్టిగా కలిసి పని చేద్దామని సమస్యల పరిష్కారానికి హై కమాండ్ కు అంశాల వారీగా తెలియజేయవలసిన బాధ్యత అందరికీ ఉన్నదన్నారు. అంతేకాక విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ అధ్యక్షురాలుగా నెక్కలపు వాణిశ్రీ పేరు ప్రతిపాదిస్తూ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించాలని ఆయన కోరగా వెనువెంటనే అందరూ ఆమోదించడం జరిగింది. పలు గ్రామాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం స్వాతంత్ర దినోత్సవ ఉత్సవ మహోత్సవ వేడుకలలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు.

## ఉద్యోగాలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే - ఎమ్మెల్యే గద్దె రామమోహన్....



**విజయవాడ (కృష్ణలంక),ఆగష్టు 12 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం పై లేనిపోని అవాస్తవాలను ప్రచారం చేస్తూ యువతను, ప్రజలను మోసం చేయాలని వైఎస్సార్సీపీ నాయకులు ,ప్రయత్నిసు న్నారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.బుధవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 12 వ డివిజన్ అశోక్‌నగర్ రఘు గార్డెన్స్ ఏరియాలో టీడీపీ డోర్-టు-డోర్ కార్యక్రమం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ మెగా డీఎస్సీని సమర్థవంతంగా నిర్వహించి వేల మందికి ఉద్యోగాలు కల్పించిన కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్సీపీ నాయకులు కావాలనే అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. యువత వైఎస్సార్సీపీ కపట నాటకాలను అర్థం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో డీఎస్సీ నిర్వహించలేదని, ఉద్యోగాలు ఇవ్వలేదని, ఉద్యోగాలు ఇవ్వకుండా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి యువతను అప్పుడూ మోసం చేశారని, ఇప్పుడు కూడ మోసం చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉద్యోగాలు, రాష్ట్రాభివృద్ధి తో పాటుగా ప్రజా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, అందుకే అసూయతో వైఎస్సార్సీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై లేని పోని అవాస్తవాలను పనిగట్టుకొని ప్రచారం చేస్తున్నారన్నారు. డీఎస్సీ పరీక్ష రాయని వారిని, యువత కాని వారిని తీసుకొచ్చి అవాస్తవాలతో దుష్ప్రచారాలు చేస్తున్నరన్నారు. రాష్ట్రం లోని యువత, ప్రజలు వైఎస్సార్సీపీ చేస్తున్న మోసాలను తెలుసుకొని వాస్తవాలను గ్రహించి కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కోరారు. ఈ కార్యక్రమంలో పొట్లూరి సాయిబాబు, అబ్దుల్ కరీమ్, పఠాన్ హయత్ ఖాన్, మేదరమెట్ల నారాయణ, బోర్రా బాలు, రాజేశ్వరి, అరుణ, పఠాన్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 23న విజయవాడలో 'సృజనోత్సవం'

● ఠాగూర్ గ్రంథాలయం ఆడిటోరియంలో రోజంతా సాహిత్య సాంస్కృతిక సందడి

● కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించిన ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్. బేగ్





**విజయవాడ, ఆగష్టు 12 (వార్తాప్రభ) :** కవులు, రచయితలు, కళాకారుల్ని ప్రోత్సహించేందుకు మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆగస్టు 23న ఆదివారం విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో జరపబోతున్న 'సృజనోత్సవం' కార్యక్రమం విజయవంతం కావాలని ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్. బేగ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమ కరపత్రాన్ని బుధవారం ఠాగూర్ గ్రంథాలయం ఆడిటోరియంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ- వాడుక భాష పితామహుడు గిడుగు రామమూర్తి జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని ముందుగానే జరపబోతున్న కార్యక్రమాల్ని అందరూ విజయవంతం చేయాల న్నారు. తెలుగు భాష, భాషతో పాటు సంస్కృతి సంప్రదాయాల్ని మరింత మెరుగుపరిచే విధంగా కార్యక్రమాల్ని రూపొందించాలని నిర్వాహకులకు తెలిపారు. గ్రంథాలయాలు మరింత అభివృద్ధి చెందేలా, విద్యార్థులు అధిక సంఖ్యలో గ్రంథాలయాలకు వచ్చేలా రూపొందించే వినూత్న కార్యక్రమాలకు గ్రంథాలయం ఎప్పుడూ ఆహ్వానం పలుకుతుందన్నారు. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ మాట్లాడుతూ – ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు, మినీ స్కిట్స్, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, గజల్ గానం, గిడుగు సేవా పురస్కారాలు వుంటాయన్నారు. ఉదయం 10 గంటలకు 'కళాక్షేత్ర ది డాన్స్ అకాడమీ' నిర్వాహకులు ఎ. గీత, పి. మౌనిక శిష్యబృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. హాజరైన కవులు, కళాకారులందరికీ మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశామన్నారు. శాలువా, జ్ఞాపికతో సత్కారం వుంటుందన్నారు. కవి సమ్మేళనం కోసం 8332903156 నెంబరులో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో సృజనోత్సవం పర్యవేక్షకుడు చొప్పా రాఘవేంద్రశేఖర్, కల్చరల్ విభాగం పర్యవేక్షకుడు వై. డి. ఆనంద్, విష్ణుభొట్ల రామకృష్ణ, గ్రంథాయాధికారిణి కె. రమాదేవి పాల్గొన్నారు.

## మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రపంచ అవయవ దాన దినోత్సవం అవగాహన ర్యాలీ




**గూడూరు,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షులు మరియు జీవన్దాన్ ఆర్గాన్ డోనార్ డాక్టర్ బండి. శ్యామసుందర రావు అలియాస్ మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ . షేక్. షరీన్ మరియు ఆర్.ఎం.ఓ. డాక్టర్. పి. ప్రసూన ల సహకారం తో గవర్నమెంట్ హాస్పిటల్ నుండి క్లాక్ టవర్ వరకు ప్రపంచ అవయవ దాన దినోత్సవంపై బుధవారం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం సూపరింటెండెంట్ ప్రస్మగిస్తూ ఆర్గాన్ డొనేషన్ చేయడం వలన చాలా మంది ప్రాణాలు కాపాడు గలుగుతామనీ,ప్రతి ఒక్కరు ఆర్గాన్ డొనేషన్ చేయగలరని విజ్ఞప్తి చేశారు. శ్రీ కృష్ణ సేవా సమితి ఫౌండర్ చైర్మన్ మరియు జీవన్దాన్ ఆర్గాన్ డోనర్ డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ఈరోజు నా శ్రీమతి మహేశ్వరి ఆర్గాన్ డోనార్ గా తన పేరు నమోదు చేయింకున్నార న్నారు. ఇదే విదంగా ఆర్గాన్ డొనేషన్ గురించి అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీని నిర్వహించి అవగాహన కల్పించామని మయూరి శ్యామ్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ షరీన,ఆర్.ఎం.ఓ. ప్రసూన మరియు హాస్పిటల్ డాక్టర్స్ డాక్టర్. వెంకటాచలపతి, లక్ష్మీనారాయణ, శ్వేత, చారీస్మా మరియు నర్సింగ్ సూపరింటెండెంట్ లక్ష్మి కాంతం, హెడ్ నర్స్ నిర్మల గారు, బ్లడ్ బ్యాంక్ ల్యాబ్ టెక్నీషియన్ మౌలాలి మరియు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు

## తిరువూరు మండలం అక్కపాలెంలో ఆక్రమించిన ప్రభుత్వ భూమిని పరిశీలించిన తిరువూరు ఆర్డీఓ



**తిరువూరు,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** తిరువూరు మండలం అక్కపాలెం రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వ భూమి ఆర్ఎస్ నెం. 3-1లోని 1.80 సెంట్ల భూమిని బాయన సాంబశివరావు, తోటకూర సత్యవతి అక్రమంగా ఆక్రమించుకున్నారనే ఫిర్యాదు మేరకు తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ. కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమణకు గురైన భూమిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని ఆర్డీఓ సూచించారు. ఈ మేరకు సదరు భూమిని స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని తిరువూరు తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన గ్రామ ప్రజలు రెవెన్యూ డివిజన్ అధికారి వారు చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకొని గ్రామంలో ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణ గురి అయిన యడల అధికారుల దృష్టికి తీసుకురాగలమని తెలియజేసి ఉన్నారు కార్యక్రమంలో తహసీల్దార్, మండల సర్వేయర్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ పాల్గొన్నారు.

## శ్రీ సిద్ధార్థ మెగా వైద్య శిబిరం సక్సెస్





**విస్సన్నపేట,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో శ్రీ సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత మేడా మోహనరావు సౌజన్యంతో ఆంధ్ర హాస్పిటల్ మరియు స్టార్ హెల్త్ సహాయ సహకారాలతో భారీ వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమ శిబిరాన్ని మండల తాసిల్దార్ కే లక్ష్మి కళ్యాణి, ఎంపీడీవో చిన్న రాట్నాలు సంయుక్తంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు అందించడం పేదలకు వరమనారు. ఈ కార్యక్రమంలో శ్రీ సిద్ధార్థ ఎం సత్యనారాయణ, స్టార్ హెల్త్ నిర్వాహకులు కే ఉమాశంకర్, ఆంధ్ర హాస్పిటల్ డాక్టర్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నేతన్నల సేవ లో పథకం లబ్ధిదారుల వివరాలు కోరిన వైసీపీ మాజీ కౌన్సిలర్ కటకం ప్రసాద్



**పెడన,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నేతన్నల సేవ పథకం ద్వారా పెడన పట్టణంలో అర్హులైన చేనేత కార్మికుల వివరాలను వెల్లడించలేదు. ఈ పథకం గురించి పథకం వలన అర్హులైన లబ్ధిదారులు వివరాలు బహిర్గత పరచాలని కోరుతూ సమాచార హక్కు చట్టం ద్వారా పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మున్సిపల్ కార్యాలయ ఇన్చార్జ్ అధికారికి మున్సిపల్ మేనేజర్ సుందరం కు లేఖను అందజేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా అందించిన లేఖను అధికారులు స్వీకరించి త్వరలోనే తగిన సమాచారం అందిస్తారని ఈ సందర్భంగా కటకం ప్రసాద్ కి మేనేజర్ హామీ ఇచ్చారు.

# గిరి ప్రసాద్ నగర్‌లో ఏడవ రోజు పాదయాత్ర

**మేడ్చల్ నియోజకవర్గం ఇన్చార్జ్ తోటపల్లి శంకర్.**



**జవహర్ నగర్, ఆగస్టు 12:(వార్తా ప్రభ)**జవహర్ నగర్‌కార్మికులు, పేదల ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ ఆధ్వర్యంలో జవహర్ నగర్‌లోని గిరి ప్రసాద్ నగర్‌లో నిర్వహిస్తున్న పాదయాత్ర గురువారం ఏడవ రోజుకు చేరుకుంది. కాలనీవాసుల సమస్యలను తెలుసుకుంటూ, ప్రజా పోరాటాలను ఉధృతం చేసేందుకు నిర్వహించిన ఈ పాదయాత్ర స్థానికుల నుంచి విశేష స్పందన పొందింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజకవర్గం ఇన్చార్జ్ తోటపల్లి శంకర్ మాజీ ఎంపీటీసీ పాల్గొని ప్రసంగించారు. కాలనీలలో నెలకొన్న మౌలిక వసతుల లేమి, డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. పేదల హక్కుల సాధన కోసం సిపిఐ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ పాదయాత్రలో పలువురు పార్టీ ప్రజాసంఘాల ముఖ్య నాయకులు భాగస్వాములయ్యారు:సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నర్సింహులు సిపిఐ కాప్రామండల కార్యదర్శి దర్శనం యాదగిరి, వి. వెంకటాచారి ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి, వి. స్వరూప నాయక్ -- గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి, వి. రవి నాయక్ -- కీసర మండల సహాయ కార్యదర్శిఅలాగే స్థానిక నాయకులు కే. కుమార్, కే. కురుమయ్య, పి. నరసింహ, డి. మల్లిక, సూర్యం, ఎల్లయ్య తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను జయప్రదం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాలు ఆగవని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

## గణేష్ నగర్, రంగారెడ్డి నగర్‌లో ఘనంగా అమ్మవారి ఫలారం బండి ఊరేగింపు

**జిల్లా అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డి, నల్ల జయశంకర్ గౌడ్ హాజరు**

**సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే ఉత్సవాలు: నాయకుల ప్రశంస**







**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12, (వార్తాప్రభ)** : గణేష్ నగర్‌లో శరత్, శ్రీకాంత్ నిర్వహణ ఆధ్వర్యంలో అమ్మవారి ఫలారం బండి ఊరేగింపు కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ వేడుకల్లో భారతీయ జనతా పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా నూతన అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డి, పార్టీ జిల్లా నాయకుడు నల్ల జయశంకర్ గౌడ్ కలిసి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు సమర్పించారు. అలాగే రంగారెడ్డి నగర్‌లో బీజేపీ రాష్ట్ర ఓబీసీ విభాగం (సెల్) ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి ఫలారం బండి ఊరేగింపు కార్యక్రమంలో కూడా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, యువకులు, బస్తీవాసులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి నిష్టతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్ల జయశంకర్ గౌడ్ మాట్లాడుతూ.. మన పురాతన సంప్రదాయాలు, సంస్కృతి, ఆధ్యాత్మిక విశ్వాసాలకు నిలువెత్తు ప్రతీకగా నిలిచే ఇటువంటి ఉత్సవాలు ప్రజలందరిలో ఐక్యతను, భక్తిభావాన్ని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గణేష్ నగర్, రంగారెడ్డి నగర్ ప్రజలందరికీ అమ్మవారి దివ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కట్ట కుమార్, పులి బలరాం, ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కోలాహలంగా అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు

**ప్రత్యేక పూజలు నిర్వహించి పోతరాజులతో కలిసి నృత్యం చేసిన కుంట సిద్దిరాములు**

**భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12, (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ 286 విభాగం (డివిజన్) పరిధిలో అమ్మవారి బోనాల ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా గుడ్డి (ఆటో) బలరాం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, ఆధ్యాత్మిక పాటలు, శివసత్తుల సిగాలు మరియు పోతరాజుల విన్యాసాల నడుమ ఈ ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో కుంట సిద్దిరాములు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. అనంతరం ఊరేగింపులో పోతరాజులతో కలిసి ఉత్సాహంగా నృత్యం (డాన్స్) చేసి భక్తులలో నూతనోత్సాహాన్ని నింపారు. అమ్మవారి దయాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా కోరుకున్నారు. ఈ ఫలహారం బండి ఊరేగింపు మహోత్సవంలో పోగు సమ్మయ్య నేత, దోసాడా శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులతో పాటు స్థానిక మహిళలు, కాలనీవాసులు మరియు భక్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

# గ్రౌండ్‌లో మిన్నంటిన దేశభక్తి ర్యాలీ!!

- ప్రతి ఇంటా ఎగరాలి త్రివర్ణ పతాకం
- మాజీ సైనికులకు ఘన సన్మానం
- కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా



**పెద్దపల్లి/గోదావరిఖని, ఆగస్టు 12 (వార్తాప్రభ):**భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన 'హర్ ఘర్ తిరంగా' పిలుపుతో గోదావరిఖని పీజీ కాలేజ్ గ్రౌండ్ శోభాయమానంగా మారింది. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై, బుధవారం మైదానానికి విచ్చేసిన వాకర్స్‌కు గౌరవపూర్వకంగా జాతీయ పతాకాలను అందజేశారు. సరిహద్దుల్లో మాతృభూమి పరిరక్షణ కోసం తమ సర్వస్వాన్ని ధారపోసిన మాజీ సైనికులు ఎస్. గంగరాజు, ఈ. శ్రీను, పి. భాస్కర్, కార్తీక్, ఎం. జర్మయ్య, టి. రాముడు, ఎ. అంబారావు, వి. శ్రీనివాస్, లక్ష్మణ్ సింగ్, ఎన్. శంకర్, ఎస్.కె. నజీబ్, ఎస్. సుధాకర్, శ్యాం కుమార్, నాగరాజు, సంతోష్, నరసింహులు, రాంబాబు, బి. పోచన్నలను ఆమె శాలువాలతో అత్యంత ఘనంగా సత్కరించి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మన దేశ సంస్కృతి, ఐక్యత, మహనీయుల త్యాగాల గొప్పదనాన్ని స్మరించుకుంటూ భారతీయులుగా జీవించడమే లభించిన అతిపెద్ద గర్వకారణమని ఉద్ఘాటించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆగస్టు 10 నుంచి 15 వరకు రామగుండం నియోజకవర్గంలో ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగురవేసి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం వాకర్స్, మాజీ సైనికులు, బీజేపీ స్థానిక నాయకులు భూమయ్య, అపర్ణ, రమేష్ తదితరులతో కలిసి త్రివర్ణ పతాకాలను చేతబూని 'భారత్ మాతా కీ జై', 'వందేమాతరం' నినాదాలతో నిర్వహించిన ర్యాలీ గ్రౌండ్‌లో దేశభక్తి ఉప్పొంగేలా చేసింది.

# రామునిగుండాల్లో విద్యార్థుల క్షేత్ర పర్యటన!!

- ప్రకృతి అందాలను పరిశీలించిన డిగ్రీ స్టూడెంట్స్
- పర్యావరణ పరిరక్షణపై అవగాహన
- సీడ్ బాల్స్‌తో హరిత సందేశం
- వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు



**పెద్దపల్లి/గోదావరిఖని, ఆగస్టు 12 (వార్తాప్రభ):**తరగతి గదిలో నేర్చుకున్న పాఠాలకు ప్రకృతి ఒడిలో ప్రత్యక్ష అనుభవాన్ని జోడిస్తూ గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు రామునిగుండాల వద్ద క్షేత్ర పర్యటన నిర్వహించారు. వృక్షశాస్త్ర విభాగం డా. పి. సవిత, భౌతిక శాస్త్ర విభాగం డా. జీ. శారద ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ విద్యా విహారయాత్రలో పాల్గొన్నారు. రామునిగుండాల ప్రాంతంలోని ప్రకృతి సౌందర్యం, భౌగోళిక పరిస్థితులు, సహజ వనరులు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. అడవి ప్రాంతాల నుంచి వన్యప్రాణులు జనావాసాల్లోకి రాకుండా ఉండేందుకు ఫల వృక్షాల పెంపకాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి సీడ్ బాల్స్‌ను వివిధ ప్రాంతాల్లో ఉత్సాహంగా వెదజల్లారు. ఈ సందర్భంగా ప్రకృతి పరిరక్షణలో చిన్నచిన్న చర్యలు కూడా భవిష్యత్తులో గొప్ప ఫలితాలను ఇస్తాయని అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి అధ్యాపకులు శ్రీదేవి, సుమలత, నివేదిత పాల్గొని పర్యటనను పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు అందించారు. ప్రకృతి, పర్యావరణం, జీవ వైవిధ్యంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించడమే కాకుండా పరిశీలనా దృక్పథాన్ని అభివృద్ధి చేయడంలో ఈ పర్యటన దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు. బృందంగా పనిచేయడం, ప్రత్యక్షంగా విషయాలను అధ్యయనం చేయడం ద్వారా విద్యార్థుల్లో ఆచరణాత్మక జ్ఞానం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని డా. పి. సవిత, డా. జీ. శారద వివరించారు. విద్యార్థులకు ఇటువంటి క్షేత్ర పర్యటనలను నిర్వహించడం ద్వారా విద్యను మరింత ఆసక్తికరంగా, అనుభవాత్మకంగా మార్చవచ్చన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బందికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డు వల్ల ప్రాకృతిక నియమాల తీవ్ర ఉల్లంఘన - వెంటనే మూసివేయాలి

- జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ డిమాండ్.
- జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ అధ్యక్షతన జరిగిన మాజీ కార్పొరేటర్ల సమావేశం.



**జవహర్ నగర్, ఆగస్టు 12:(వార్తా ప్రభ)**జవహర్ నగర్ జీహెచ్ఎంసీ, కీసర సర్కిల్ వద్ద ఉన్న రాంకీ ఇంటిగ్రేటెడ్ చెత్త డంపింగ్ యార్డు గత 20 ఏళ్లుగా ప్రాకృతిక నియమాలను, పర్యావరణ పరిరక్షణ చట్టాలను తీవ్రంగా ఉల్లంఘిస్తోందని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ స్పష్టం చేశారు. అందుకే ప్రజల న్యాయమైన, ప్రజాస్వామికమైన డంపింగ్ యార్డు సమస్యపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోపాటు మల్కాజిగిరి ఎం.పి. ఈటేల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి లు సుముఖంగా ఉన్నారని అన్నారు. 2026, ఆగస్టు-12, బుధవారం రోజు, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలో గల ప్రగతినగర్, నీలం రాంచంద్రయ్య భవన్ లో డంపింగ్ యార్డు శాశ్వత పరిష్కారానికి జరుగుతున్న సన్నాహక కార్యక్రమంలో బాగంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ ఆహ్వానం మేరకు ఏర్పాటు చేసిన మాజీ ప్రజా ప్రతినిధుల సమావేశంలో మేయర్, డిప్యూటీ మేయర్ డంపింగ్ యార్డు మూసివేత డిమాండ్ ను బలపరిచారు. ప్రజా క్షేత్రంలో మరింత ఉధృతంగా తీసుకెళ్ళేందుకు శుక్రవారం రోజు అనగా14 వ తేదీన మరోసారి కార్పొరేట్ల సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని, జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీలో తమవంతు బాగస్వామ్యం ఉంటుందని స్పష్టం చేశారు. జెండాలు, పార్టీలు, వ్యక్తిగత అభిమానాలకు అతీతంగా జరిగే ప్రజల ఆరోగ్య భద్రత, పర్యావరణ పరిరక్షణ, జీవించే హక్కు కొరకు తమ మద్దతు, సహకారం ఉంటుందని ఆలూరి రాజశేఖర్ సంగీత ప్రకటించారు. భూగర్భ జల కాలుష్యం, సుమారు కోటి యాభై లక్షల మంది విసర్జించే హైదరాబాద్ నుండి తరలి వస్తున్న రోజుకు వేల టన్నుల చెత్త నుండి వచ్చే లీచేట్ నీరు భూమిలోకి ఇంకి, చుట్టుపక్కల నాలుగు మండలాల గ్రామాల ప్రజల బోర్ల నీరు విషపూరితం అయ్యాయని గొడుగు వేణు గుర్తుచేశారు. చెరువులు, కుంటలు, భూగర్భ జలాల నుండి తాగేందుకు ఒక్క చుక్క మంచి నీరు కూడ ఉపయోగ పడని ప్రాంతంగా జవహర్ డంపింగ్ భ్రష్టు పట్టించిందని ఎ.సుబ్రహ్మణ్యం ఆరోపించారు. గాలి కాలుష్యం వలన దుర్గంధం, చెత్త కుళ్లడం వల్ల వెలువడే మీథేన్, అమ్మోనియా వంటి విష వాయువులతో పిల్లలు, వృద్ధులు ఉబ్బసం, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నారని మేక లలిత యాదవ్ ఎత్తిచూపారు. ప్రకృతి విధ్వంసానికి కారణ భూతమైన రాంకీ సంస్థ వేల ఎకరాల సారవంతమైన భూమిని చెత్త కుప్పగా మారిందని మనోధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. మనుషులు, పక్షులు, జంతువుల ప్రాణాలను తీస్తూ విలువైన, సారవంతమైన నేలను, వ్యవసాయాన్ని పూర్తిగా నాశనమై పోయిందని బింగి సతీష్ గౌడ్ ఆవేదన చెందారు. ప్రజారోగ్య సంక్షోభం, దుర్వాసన, దోమలు, ఈగల వల్ల చర్మవ్యాధులు, క్యాన్సర్ కేసులతో ప్రజలు మానసిక, శారీరిక బాదలను అనుభవిస్తున్నరని కె.సాయికుమార్ తెలియజేశారు. ప్రభుత్వం పర్యావరణ అనుమతులు, ప్రజల అభిప్రాయం లేకుండానే ఈ డంపింగ్ యార్డును విస్తరిస్తోందని, ఇది రాజ్యాంగం ఇచ్చిన పరిశుభ్రమైన వాతావరణంలో జీవించే హక్కుకు పూర్తి విరుద్ధం అని ఆర్.ఎస్. శ్రీనివాస్, పల్లపురవి అన్నారు. ఐ.ఎఫ్.టి.యు. మరియు కోశాధికారి పిశివబాబు, మాజీ ఉపసర్పంచ్, గౌరవ సలహాదారులు ఆర్.నర్సింహా గౌడ్, బీఆర్ఎస్ కొండల్ ముదిరాజ్, ఆలూరి రాజశేఖర్, సిపిఐ తోటపల్లి శంకర్, సిపిఎం శివన్నారాయణ, సిపిఐ(ఎం.ఎల్)న్యూడెమోక్రసీ అనురాధ, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ వి.ప్రవీణ్, పిడిఎం చంద్రమౌళి, పిఓడబ్ల్యు(విముక్తి) గడిపే సునీత తదితరులుజవహర్ నగర్ రాంకీ డంపింగ్ యార్డును వెంటనే మూసివేయాలని, కలుషితమైన భూమి, నీటిని శుద్ధి చేయడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని,ప్రభావిత గ్రామాల ప్రజలకు ఉచిత వైద్యం, ప్రత్యామ్నాయ తాగునీరు ఏర్పాటు చేయాలనిచెత్త నిర్వహణకు వికేంద్రీకృత, ప్రాకృతిక పద్ధతులను అమలు చేయాలని పై సమావేశంలో గొంతెత్తి నినదించారు. ప్రకృతిని, ప్రజల ప్రాణాలను కాపాడటమే తమ పోరాట కమిటీ లక్ష్యం అని ప్రజాప్రతినిధుల ముందు స్పష్టం చేశారు

# పోలీసుల అత్యుత్సాహం. రాజకీయ ప్రాకులాటకు అడ్డుకట్ట వేయాలి.

**పక్షపాత ధోరణి విడనాడాలి.**

**పి.వి.రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్ .**



**కాకినాడ ఆగస్టు 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎస్.అచ్యుతాపురంలో క్రికెట్ గ్రౌండ్ వివాదం నేపథ్యంలో పోలీసులు వ్యవహరించిన తీరు పట్ల పి.వి.రావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పండు అశోక్ కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బాధితుల తరఫున నిలిచిన దళిత మహిళలతో పోలీసులు అర్ధరాత్రి వేళ అమర్యాదగా, దుర్భాషలాడుతూ వ్యవహరించారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసులు చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యతను విస్మరించి, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పేదలు, దళితుల పట్ల దురుసుగా వ్యవహరిస్తే సహించేది లేదని అశోక్ కుమార్ హెచ్చరించారు. ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రాపకం కోసం పోలీసులపై రాజకీయ ప్రభావం చూపుతున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అధికారులు పక్షపాత ధోరణిని విడనాడాలని సూచించారు. క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన ఘర్షణకు సంబంధించి బాధితుల తరఫున ఉన్న మహిళలను అర్ధరాత్రి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు ప్రయత్నించడం, వారితో ఇష్టానుసారంగా మాట్లాడటం సమంజసం కాదని ఆయన అన్నారు. మహిళల పట్ల పోలీసులు వ్యవహరించాల్సిన విధానంపై ఉన్న నిబంధనలను అధికారులు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే తరహా ఘటనలు కొనసాగితే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. లీగల్ అడ్వైజర్ కొంగు నూకరాజు మాట్లాడుతూ బచ్చల అభిషేక్, బచ్చుల సునీల్ తల్లి పట్ల పోలీసులు మాట్లాడిన తీరు అభ్యంతరకరంగా ఉందని ఆరోపించారు. ఈ విషయంపై సీఐని కలిసినప్పుడు రెండు వర్గాలపైనా కేసులు నమోదు చేసినట్లు తెలిపారని అన్నారు. అయితే తమ వర్గీయులపై సుమారు 60 మంది దాడి చేశారని చెబుతున్న నేపథ్యంలో ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఏ వర్గానికీ అనుకూలంగా కాకుండా చట్టప్రకారం వ్యవహరించాలని, బాధిత దళిత యువకుల కుటుంబ సభ్యుల పట్ల కూడా గౌరవప్రదంగా వ్యవహరించాలని నూకరాజు కోరారు. సమావేశంలో బాధిత కుటుంబ సభ్యులు సైతం పోలీసుల తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ముప్పిడి యేసుదాస్‌తో పాటు పలువురు దళిత యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# హైదరాబాద్

## మియాపూర్ డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తా

**-శాసనసభ్యులు అరెకపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి,ఆగస్టు 12 (వార్తాప్రభ ):** మియాపూర్ డివిజన్ పరిధిలోని డీకే ఎన్‌క్లేవ్ కాలనీలో నిర్వహించిన వన్‌డే--వన్‌వార్డ్ కార్యక్రమంలో కాలనీల సమస్యలు, అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అధికా. రులతో సమీక్ష నిర్వహించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి.సృజన, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి,డీసీ శ్రీనివాస్ యాదవ్, తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు,కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మియాపూర్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను కోరారు. రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను పరిష్కరించడంతో పాటు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అసంపూర్తిగా ఉన్న నాలాల విస్తరణ పనులను పూర్తి చేసి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. కాలనీల్లో పార్కులను అభివృద్ధి చేసి, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు పిల్లలు, వృద్ధులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని, తడి--పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించారు. మియాపూర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని గాంధీ పేర్కొన్నారు.

## జవహర్ నగర్ డివిజన్లో పర్యటించిన జోనల్ కమిషనర్ రాధిక గుప్తా.



**జవహర్ నగర్, ఆగస్ట్ 12:(వార్తా ప్రభ)**మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ జవహర్ నగర్ డివిజన్ పరిధిలో సంతోష్ నగర్, పాపయ్య నగర్ కాలనీ లో జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, మరియు సంచిత్ గంగ్వార్, ముందస్తు చర్యలకోసం మరియు ఓపెన్ నాలా ల సమస్యలు శాశ్వత పరిష్కారం దిశగా పర్యటనా చేసారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్ల వినయ్, నాయకులు శ్రీను,బుజ్జి,భాస్కర్,అజయ్,సోమేష్,రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఐడీపీఎల్ ఎక్స్ రోడ్స్ నుండి తిరంగా ర్యాలీ లిలి విజయవంతం చేయాలని బీజేపీ పిలుపు

**ఎంపీ ఈటల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు డి. గిరి వర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు**

**దేశభక్తి, జాతీయ ఐక్యత చాటేలా 500 మందితో భారీ ర్యాలీకి ఏర్పాట్లు**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12, (వార్తాప్రభ)** : భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎమ్) మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజ కవర్గంలో నిర్వహించనున్న తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆగస్టు 13 నాడు మధ్యాహ్నం 2:30 గంటలకు ఐడీపీఎల్ ఎక్స్ రోడ్ నుండి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం వరకు కొనసాగనుంది. ఈ తిరంగా ర్యాలీకి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు డి. గిరి వర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. వారితో పాటు మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. సుమారు 500 మందితో అత్యంత వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు వేముల రమేష్, పులి బలరాం, మణి, రావుల పృథ్వీ, నాగదీప్ గౌడ్, విజయ్, నల్ల జయశంకర్ గౌడ్ తదితరులు మాట్లాడారు. జాతీయ ఐక్యతను, దేశభక్తిని చాటిచెప్పే ఈ ర్యాలీలో ప్రజలు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ర్యాలీని శాంతియుతంగా, క్రమశిక్షణతో నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనలు, పోలీసుల సూచనలు మరియు ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. "దేశభక్తి చాటుదాం - తిరంగాను గౌరవిద్దాం - తిరంగా ర్యాలీని విజయవంతం చేద్దాం" అనే నినాదంతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

# సంపాదకీయం

## మరో భారీ ఉద్యమానికి బొద్దింకల పార్టీ సిద్ధం

బొద్దింకలను ఎవరూ ఇపుడు తేలికగా చూడడం లేదు. ఎందుకంటే అందరి కళ్ళ ముందు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసన ఉంది. అందులో కేంద్ర ప్రభుత్వాన్ని తమ వద్దకు రప్పించుకుని మరీ డిమాండ్లు సాధించిన వైనం చూసిన వారు వామ్మో బొద్దింకలు మామూలువి కావు అనుకున్నారు. ఇంత జరిగిన తరువాత కేంద్ర మంత్రి చేత రాజీనామా కూడా ఇప్పించాక బొద్దింకల పార్టీ తరువాత అడుగు ఏమిటి ఎటు వైపు అని అంతా అనుకున్నారు. అయితే కాస్తా విరామం తీసుకుని బొద్దింకల పార్టీ దేశంలోని అందరికీ కనెక్ట్ అయ్యే మరో కీలక అంశంతో భారీ ఎత్తున ఆందోళనకు సిద్ధం కాబోతోంది అని అంటున్నారు.దేశంలో గ్రామీణ ప్రాంతం చాలా ఎక్కువ. అక్కడ సర్కారీ బడుల పరిస్థితులు అంటే ఎవరైనా ఇట్టే తమ అనుభవంతో చెబుతారు. సౌకర్యాలు లేమి గురించి కూడా మాట్లాడుతారు. అలాంటి పెల్లలలో బడుల తీరు మారాలన్నది ఇపుడు బొద్దింకల పార్టీ కొత్త అజెండా, సరికొత్త ఉద్యమానికి అదే కీలకమైన అంశంగా ఉండబోతోంది. ఈ దేశానికి స్వేచ్ఛా స్వాంతంత్ర్యం లభించి ఏకంగా ఎనిమిది దశాబ్దాలు గడుస్తున్నాయి. మరి ఇంత కాలం జరిగినా కూడా ఎక్కడా అభివృద్ధి అన్నది లేదని కాక్రోచ్ పార్టీ భావనగా ఉంది. అంతే కాదు పల్లె సీమలలో పరిస్థితులు ఏ మాత్రం మారలేదని అంటోంది. అక్కడ విద్యా బుద్ధులు నేర్పే బడులు బాగుంటే దేశం బాగుంటుంది అన్నది బొద్దింకల పార్టీ ఆలోచనగా చెబుతున్నారు. దాంతోనే ఈ కీలకమైన అంశాన్ని తీసుకుని ఉద్యమించాలని చూస్తోంది అని అంటున్నారు. ఇక ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆగస్టు 15నే తమ ఆందోళనలకు ముహూర్తంగా కాక్రోచ్ పార్టీ ఎంచుకుంది అని అంటున్నారు. అంతే కాదు గ్రామాలలో కనీస సదుపాయాలు కూడా లేవన్నది కాక్రోచ్ పార్టీ ఆరోపిస్తున్న మరో ముఖ్యమైన అంశం. భారత దేశం అంటే గ్రామీణ భారతం అని చెబుతారు. అలాంటి గ్రామీణ ప్రాంతం అధికంగా ఉన్న చోట అభివృద్ధి ఫలాలు ఎవరికీ పెద్దగా చేరడం లేదని సీజేపీ అంటోంది. దీంతో పెల్లలలో బడులని తిరిగి నిర్మించడం పల్లెలు ప్రగతి సీమలుగా మారాలన్నది అజెండాగా చేసుకుని సీజేపీ వ్యవస్థాపకుడు అయిన అభిజీత్ దిప్కే అతి పెద్ద ఉద్యమానికి రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు ఆయన ప్రకటించారు కూడా. ఇక అభిజీత్ దిప్కే మహారాష్ట్ర వాసి కావడంతో ఆయన ఆగస్టు 15వ తేదీన తన సొంత రాష్ట్రం అయిన మహారాష్ట్రలోని హింగోలీ గ్రామం నుంచి పల్లె బడుల దుస్థితి మీద ఎలుగెత్తి చాటేందుకు రెడీ అవుతున్నారు. ఆయన అక్కడ నుంచి ఆ రోజు ఈ నిరసన కార్యక్రమం ప్రారంభిస్తే సీజేపీకి చెందిన వివిధ రాష్ట్రాల బాధ్యులు అంతా తలో రాష్ట్రంలో తమ ప్రాంతాల నుంచి ఈ ఉద్యమానికి శ్రీకారం చుడతారు అని అంటున్నారు. ఇక అభిజీత్ దిప్కే మాటలు చూస్తే పల్లెలు ఎంతటి అన్యాయంగా మారుతున్నాయో అన్న ఆగ్రహం వ్యక్తం అవుతోంది. పల్లెలలో పిల్లలకు ఈ రోజుకీ నాణ్యమైన మంచి విద్య లభించడం లేదని ఆయన ఆగ్రహించారు. చదువు కోసం కిలోమీటర్ల దూరం వెళ్ళే పిల్లలకు కనీసం తాగు నీరు అలాగే మరుగు దొడ్ల సదుపాయం లేదని ఆడ పిల్లలు పడుతున్న సమస్యలు ఎన్నో ఉన్నాయని అభిజీత్ దిప్కే అంటున్నారు. గ్రామ సీమలు బాగు పడాలీ అంటే సర్పంచులు ముందుకు రావాలని అభిజీత్ దిప్కే కోరారు. వారుకే సీజేపీ పిలుపు ఇస్తోంది అన్నారు. దానికి సర్పంచ్ ఛాలెంజ్ అని పేరు పెట్టారు. మీ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాల రూపు రేఖలు మార్చాల్సింది మీరే అని అభిజీత్ దిప్కే వారిని కోరారు. పాత బడులను బాగు చేయాలని అలా చేసిన తరువాత పాత బడులు కొత్త బడులను సోషల్ మీడియా వేదికగా ప్రజల ముందు తీసుకుని వెళ్తామని అలా బాగు చేసిన సర్పంచులకు తగిన గౌరవం అందిస్తామని అభిజీత్ దిప్కే అంటున్నారు. సర్పంచులు దేశవ్యాప్తంగా ముందుకు రావాలని ఆయన కోరారు. తల్లిదండ్రుల భాగస్వామ్యం : కేవలం సర్పంచులే కాకుండా తల్లిదండ్రులు కూడా తమ ఊరిలో ప్రభుత్వ పాఠశాలల పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని అభిజీత్ దిప్కే కోరుతున్నారు. తమ బిడ్డలను చదివిస్తున్న పల్లెలలో కనీస సదుపాయాలు ఉన్నాయో లేవో అన్నది సోషల్ ఆడిట్ తల్లిదండ్రులే చేపట్టాలని ఆయన సూచించరు. ఒకవేళ ఎక్కడైనా లేకపోతే ఏమి లేదో వాటిని ఫోటోలు తీసి సోషల్ మీడియా ద్వారా అందరితో పంచుకోవాలని కోరారు. పట్నాలకు అందే అన్ని సదుపాయాలు పల్లెలకు అందాలని అభిజీత్ దిప్కే అన్నారు. పల్లెలే అసలైన దేశం అన్నది సీజేపీ నినాదంగా చెప్పారు. మొత్తం మీద ఒక ఉదాత్తమైన అంశాన్ని ఎంచుకుని సీజేపీ ఈ ఆగస్టు 15 నుంచి రంగంలోకి దిగుతోంది. మరి దీనిని దేశవ్యాప్తంగా ఏ మేరకు మద్దతు దక్కుతుంది అన్నది చూడాల్సి ఉంది.

## విద్యార్థులకు బస్ పాసులు అందజేత...



**పెనుగంచిప్రోలు – ఆగస్టు 12( వార్త ప్రభ )** పాఠశాల విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయటం సంతోషకరమని గ్రామ పెద్దలు మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు చింతల సీతారామయ్య , మాజీ జడ్పిటిసి సభ్యులు గజ్జి కృష్ణమూర్తి అన్నారు. బుధవారం నాడు పెనుగంచిప్రోలు రాధాకృష్ణ ఫంక్షన్ హాలులో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు ముచ్చింతాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు పాసులు అందజేశారు. ఇంతవరకు ముచ్చింతల గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు పలు ఇబ్బందులు పడేవారు. గ్రామ పెద్దలు చింతల సీతారామయ్య ఈ విషయాన్ని శాసనసభ్యుల దృష్టికి తీసుకుని వెళ్లి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. కానీ ఏపీఎస్ఆర్టీసీ కంప్యూటర్ సమాచారం లో ముచ్చింతాల మ్యాపింగు అవలేదు. దానివల్ల బస్సు పాసులు ఈయడం ఇబ్బందికరంగా మారింది. దీనితో మళ్ళీ డిపో కంట్రోలరుతో సంప్రదించగా విజయవాడ కార్యాలయంతో మాట్లాడి ముచ్చింతాల గ్రామాన్ని మ్యాపింగ్ చేయడం జరిగింది. బుధవారం నాడు బస్సు పాసులు రావడంతో పాసులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లగడపాటి ప్రవీణ్, మాదినేని వెంకటరావు, కాకాని శేషగిరి, ప్రధానోపాధ్యాయులు నక్కా బాబురావు, ఉపాధ్యాయులు ముక్కా సత్యనారాయణ. వేగినేటి రమణ తదితరులు పాల్గొన్నారు.

# అధ్వానంగా మున్సిపల్ అధికారుల పనితీరు

- మున్సిపల్ అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేసిన ప్రముఖ న్యాయవాది
- సిపిఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు

**జగ్గయ్యపేట ఆగస్టు 12 (వార్తా ప్రభ)** మున్సిపల్ అధికారుల పని అద్వానంగా ఉందని అసహనం వ్యక్తం చేసిన ప్రముఖ న్యాయవాది మరియు సిపిఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ. పట్టణంలో సుమారు 130 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నప్పటికీ శానిటేషన్ పై అధికారులు అలసత్వం వహిస్తున్నారని. మంచినీటి సరఫరా, కాలువలో పూడిక తీయడం, ప్రస్తుతం నడుస్తున్న వర్షాకాలంలో దోమల విపరీతంగా పెరిగాయని దోమలు నియంత్రణ చర్యలు బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ వంటివి కంటికి కూడా కనిపించడం లేదని. పట్టణ ప్రజలు చెల్లించే పన్నులతో జీతాలు తీసుకునే మున్సిపల్ సిబ్బంది పుర ప్రజలకు ఎటువంటి సేవలు చేయడం లేదని విమర్శించారు. సాక్షాత్తు మున్సిపల్ చైర్మన్ ఇటీవల మున్సిపల్ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, విధుల్లో అలసత్వం వహిస్తున్నారని తనను కూడా లెక్కచేయడం లేదని ప్రజలకు తెలియజేశారని. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి సిబ్బందిని గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందని. ప్రజలకు శానిటేషన్, వాటర్ సప్లై, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ సేవలు మెరుగుపరిచి పట్టణ ప్రజలకు సేవలు అందించాల్సిన అవసరం ఉందని. కమిషనర్ మున్సిపల్ పార్కును కూడా సందర్శించాల్సిన అవసరం ఉందని, ఇంటి పన్నులు వసూలు



లో ఉన్న శ్రద్ధ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో లేదని. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని. లేనిపక్షంలో రానున్న కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పనితీరుపై ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని తెలియజేశారు.

# దేశ ప్రజలలో దేశభక్తిని పూర్తి పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా

- బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్
- మండల బిజెపి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12(వార్తా ప్రభ ప్రతినిధి):**దేశ ప్రజలలో దేశభక్తి, జాతీయ స్ఫూర్తి పెంపొందించేలా 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారుబీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్. ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షురాలు పయ్యావుల జయలక్ష్మి రాము దంపతుల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ఫ్లోరిన్స్ నైటింగేల్ నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.గ్రామ పుర వీధుల్లో జాతీయ నినాదాలతో దేశ భక్తితో ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని జాతీయంగా, అంతర్జాతీయంగా ప్రపంచానికి సూపర్ పవర్ దేశంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంతో దేశ ప్రజలందరిలో జాతీయ స్ఫూర్తి పెరగాలని ఏ విధంగా, దేశం పట్ల బాధ్యత పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి అక్కల రామమోహనరావు (గాంధీ), బీజేపీ నేతలు రేగళ్ల రఘునాథరెడ్డి, మారాసు కృష్ణ మోహన్, చిగురుపాటి లక్ష్మి, ఆలకుంట చిట్టి, తుమ్మల శ్రీ కుమార్, గోవిందు, సురేష్, ప్రసాద్, కొల్లి నాగేశ్వరరావు, కృష్ణ కుమారి, సత్యవతి, యుగంధర్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# మచిలీపట్నంలో జూనియర్ డాక్టర్ల శాంతియుత నిరసన

### స్టైఫండ్ పెంచాలని డిమాండ్ ..
### అత్యవసర సేవలు కొనసాగింపు

**మచిలీపట్నం ఆగస్టు 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు బుధవారం శాంతియుత నిరసన చేపట్టారు. ఆసుపత్రి ఆవరణలో తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసన వ్యక్తం చేశారు.జూనియర్ డాక్టర్లకు అందుతున్న స్టైఫండ్‌ను తక్షణమే పెంచాలని వారు డిమాండ్ చేశారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ డాక్టర్లకు అందుతున్న స్టైఫండ్ చాలా తక్కువగా ఉందని తెలిపారు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా స్టైఫండ్‌ను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.తమ నిరసన కారణంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలను కొనసాగిస్తున్నామని జూనియర్ డాక్టర్లు తెలిపారు. అత్యవసర సేవలతో పాటు అన్ని వైద్య సేవలను యథావిధిగా అందిస్తున్నామని స్పష్టం చేశారు.జూనియర్ డాక్టర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి స్టైఫండ్




పెంపుపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో జూనియర్ డాక్టర్ల మచిలీపట్నం అధ్యక్షుడు డాక్టర్ కే. శివబ్రహ్మం, ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్. అనిల్ కుమార్, డాక్టర్ ఎం. కోమల్ ఫణిర్మయి, కార్యదర్శి డాక్టర్ దివాకర్ రెడ్డి, ఉప కార్యదర్శి టి. రామకృష్ణ, ఎ. సంతోషిని తదితర జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

# బాపట్లలో పిఐబి విజయవాడ వర్తాలాప్ - మీడియా అవగాహన కార్యశాల

### మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా
### పరిగణిస్తారని పేర్కొన బాపట్ల కలెక్టర్




**బాపట్ల, ఆగస్టు 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారత ప్రభుత్వ సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పత్రికా సమాచార ప్రాంతీయ కార్యాలయం విజయవాడ ఆధ్వర్యంలో జిల్లా మరియు గ్రామీణ పాత్రికేయుల కోసం బాపట్లలో నిర్వహించిన 'వార్తాలాప్' మీడియా అవగాహన కార్యశాలను బాపట్ల జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్ ప్రారంభించారు.భారత ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా ప్రచారం చేయడంతో పాటు, సమకాలీన జర్నలిజం, విజయగాథలు, రిపోర్టింగ్, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని ఎదుర్కోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు పత్రికా సమాచార కార్యాలయం ఈ మీడియా అవగాహన కార్యశాలను నిర్వహించింది.బాపట్ల జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్, ఈ వార్తాలాప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి, విలేకరులను ఉద్దేశించి ప్రసంగించారు. మీడియాను ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభంగా పరిగణిస్తారని, సమాజానికి సమాచారాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. సాంప్రదాయ మీడియా నుంచి డిజిటల్ వేదికల వరకు మీడియా రంగంలో భారీ పరివర్తన చోటు చేసుకుందని ఆయన పేర్కొన్నారు. మీడియా రంగానికి గల నైతిక విలువలు, బాధ్యతాయుతమైన జర్నలిజం ప్రాముఖ్యతను ఆయన వివరించారు. సమాజానికి దోహదపడే సానుకూల, విశ్వసనీయమైన, విలువైన సమాచారాన్ని ప్రజలకు అందించాలని విలేకరులను కోరారు. సామాజిక మాధ్యమాలు వేగవంతమైన, శక్తివంతమైన సమాచార సాంకేతిక సాధనాలుగా ఆవిర్భవించాయని, సమాచార ప్రామాణికతను నిర్ధారిస్తూనే ఈ వేదికలను బాధ్యతాయుతంగా, నిర్మాణాత్మకంగా ఉపయోగించుకోవాలని విలేకరులకు పిలుపునిచ్చారు.విలేకరులను ఉద్దేశించి పిఐబి విజయవాడ డైరెక్టర్ జి. సురేష్ కుమార్ మాట్లాడుతూ.. వివిధ విధానాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులపై ప్రామాణికమైన, వేగవంతమైన సమాచారాన్ని అందించడం ద్వారా ప్రభుత్వానికి, విలేకరులకు మధ్య పిఐబి ముఖ్యమైన అనుసంధానకర్తగా పనిచేస్తుందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు వివిధ ప్రతిష్టాత్మక పథకాలు, ప్రణాళికలు, అభివృద్ధి కార్యకలాపాల పై మీడియాకు విస్తృతమైన అవగాహన కల్పించడానికి తోడ్పడతాయన్నారు. సంచలనాత్మక వార్తలకు బదులుగా సమకాలీన జర్నలిజం, విజయగాథలపై మరింత దృష్టి సారించాలని పిఐబి డైరెక్టర్ సురేష్ కుమార్ పాత్రికేయులను కోరారు. సామాజిక మాధ్యమాల ద్వారా వేగంగా సమాచార వ్యాప్తి జరుగుతున్న ప్రస్తుత తరుణంలో విశ్వసనీయమైన, ధృవీకృత సమాచారం తప్పుడు సమాచార వ్యాప్తిని అరికట్టేందుకు ఎలా దోహదపడుతుందో ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు చెందిన సీనియర్ అధికారులు కూడా ఈ వర్క్‌షాప్‌లో ప్రసంగించారు. ఏఎన్‌యూ జర్నలిజం విభాగ ప్రొఫెసర్ డాక్టర్ జి. అనిత, జర్నలిజంలో సమర్థవంతమైన సమాచార మార్పిడి మరియు నైతిక విలువలపై మాట్లాడగా, సీనియర్ కరస్పాండెంట్ సాంబ శివ రావు, బాపట్లలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఉన్న అనువైన పత్రికపరమైన అంశాల పై ఈ మీడియా అవగాహన కార్యశాలలో ప్రజెంటేషన్ ద్వారా విలేకరులకు వివరించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కె. శివ కృష్ణ కూడా ఈ వార్తాలాప్‌లో పాల్గొన్నారు.కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విలేకరులు తమ అభిప్రాయాలను పంచుకున్న పరస్పర చర్చా కార్యక్రమంతో ఈ కార్యశాల ముగిసింది.

## నూతన డిఎస్ఓని మర్యాదపూర్వకంగా కలిసిన రేషన్ డీలర్ల సంఘం నాయకులు....



**కృత్తివెన్ను ఆగస్టు 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బుధవారం నాడు కృష్ణాజిల్లా నూతన డిఎస్ఓ గా బాధ్యతలు స్వీకరించిన టి శివరాం ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన రేషన్ డీలర్ల సంఘం నాయకులు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల సుబ్రహ్మణ్యేశ్వర రావు మరియు మండల అధ్యక్ష కార్యదర్శులు డిఎస్ఓను అభినందించిన వారిలో ఉన్నారు...

## ఎల్లారెడ్డి స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు

**కామారెడ్డి, ఆగస్టు 12:(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎల్లారెడ్డి పట్టణంలో బుధవారం స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చేపూరి వెంకటస్వామి, రాజమౌళి, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రహ్లాదచారి, శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో జరిగాయి. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా వంగాల భరత్‌చారి, కార్యదర్శిగా విఠలాచారి, కోశాధికారిగా బాలచంద్రం చారి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సంఘం నాయకులు, సభ్యులు అభినందించారు. సంఘం అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు.

## నిలిచి పోయిన కల్వర్టు నిర్మాణం

### త్వరితిగతిన పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు



**జగ్గయ్యపేట ఆగస్టు 12 (వార్తా ప్రభ)** పట్టణంలోని ఏడో వార్డు ఆర్టీసీ కాలనీ నుండి జాతీయ రహదారికి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు వేపల వాగు పై నిర్మిస్తున్న కల్వర్టు పనులు నెలరోజులుగా నిలిచిపోయాయి. ఈ రోడ్డుపై పట్టణంలోని ప్రజలు జాతీయ రహదారి వరకు వెళ్లడానికి ఎక్కువగా వినియోగిస్తూ ఉంటారు. నెల రోజుల కింద బేస్మెంట్ నిర్మించిన కాంట్రాక్టర్ దానిపై స్లాబ్ నిర్మాణం చేయకుండా వదిలేశారు. దీనివల్ల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు వెంటనే కలవర్టు నిర్మాణం పూర్తి చేయాలని వారు కోరుతున్నారు. మరియు ఏడవ వార్డు ఆర్టీసీ కాలనీ నుండి కాకాని నగర్ కు అనుసంధానం చేసే నూతన కల్వట్ల నిర్మాణం కూడా వెంటనే మొదలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## పక్క పక్కనే మూడు సచివాలయాలు- అంధకారంలో వీధి



**జగ్గయ్యపేట ఆగస్టు 12 (వార్తా ప్రభ)** పట్టణంలోని ఆ వీధిలో పక్క పక్కనే మూడు సచివాలయాలు కానీ రాత్రి అయితే అంధకారంలో ఆ వీధి అని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. పట్టణంలోని కోదాడ రోడ్డు నుండి కాకాని నగర్ లోకి రావడానికి ఉన్న వీధిలో పక్క పక్కనే మూడు సచివాలయాలు ఉన్నాయని. పగలంతా సచివాల సిబ్బంది అధికారులు ఆ వీధి గుండానే ప్రయాణం చేస్తూ ఉంటారని, కానీ మూడు ప్రభుత్వ కార్యాలయాలు (1, 13,14 సచివాలయాలు), ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉన్న వీధిలో కనీసం వీధిలైట్లు ఒక్కటి కూడా లేవని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆ వీధి గుండా మహిళలు, విద్యార్థిని విద్యార్థులు, వృద్ధులు, ఎంతోమంది ప్రయాణం చేస్తూ ఉంటారని, వీధిలైట్లు లేకపోవడంతో వారి భద్రత ప్రశ్నార్థకమేనని, చీకటిని ఆసరాగా చేసుకొని మద్యం, గంజాయి సేవించిన వారు, దొంగలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉన్నందున నాయకులు, అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## రెడ్ క్రాస్ జిల్లా వార్షిక సమావేశానికి సభ్యులు విధిగా హాజరుకావాలి



**జగ్గయ్యపేట, ఆగస్టు 12 (వార్తప్రభ)** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎన్టీఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 27వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు విజయవాడ కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా నిర్వహణ కమిటీ సభ్యులు కర్లపాటి వెంకట శ్రీనివాసరావు సబ్ బ్రాంచ్ సభ్యులకు తెలియజేశారు.ఈ సమావేశానికి సంబంధించి స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, లైఫ్ మెంబర్లు మరియు సంబంధిత సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ జగ్గయ్యపేటలోని సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందజేశారు. ఈ మేరకు జగ్గయ్యపేట సబ్ బ్రాంచ్ అధ్యక్షులు గోగుశెట్టి మహేష్, ట్రెజరర్ మానేపల్లి నాగబ్రహ్మం తో కలిసి స్థానిక ఎంఆర్ఓ శ్రీమతి ఎస్.శిరిష కు సంబంధించిన సమాచారాన్ని అందజేశారు.జిల్లా శాఖ వార్షిక సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాలు, సేవా కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉన్నందున, జగ్గయ్యపేట నియోజికవర్గ పరిదిలోని సబ్ బ్రాంచ్‌కు చెందిన అర్హత కలిగిన సభ్యులు, లైఫ్ మెంబర్లు అందరూ తప్పనిసరిగా సమయానికి హాజరై సమావేశంలో చురుకుగా పాల్గొనాలని వారు కోరారు.

## రాష్ట్రస్థాయి కోకో పోటీలకు ఎంపికైన మారుతి విద్యార్థిని..బెల్లంకొండ దివ్య



**కోదూరు, ఆగస్టు 12 (వార్తా ప్రభ):**రాష్ట్రస్థాయి కోకో పోటీలకు కోదూరు మారుతి కళాశాలకు చెందిన బెల్లంకొండ దివ్య ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జేవీఎస్ఎస్ మూర్తి తెలిపారు.ఇటీవల గుడివాడ కేకేఆర్ గౌతమ్ స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 17 కోకో పోటీలలో బెల్లంకొండ దివ్య అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనదన్నారు. విద్యార్థినిని మారుతి అధ్యాపక బృందం, విద్యార్థిని తల్లిదండ్రులు అభినందించారు.

## సుభాషిత రత్నాలు

ప్రేమగా పలకరిస్తూ
నవ్వులే చిందిస్తూ
కలివిడిగా ఉండాలి
అందరినీ ప్రేమిస్తూ
కలహాలే మానేస్తూ
క్షమాగుణం చూపిస్తూ
ఉన్నతంగా బ్రతకాలి
ఐకమత్యం చాటుతూ
అల్ప బుద్ధులు వదిలేస్తూ
ద్వేషాలే తరిమేస్తూ
ఇల స్ఫూర్తిగా నిలవాలి
మంచితనం పంచుతూ
స్నేహాన్ని గౌరవిస్తూ
కన్నోళ్లను పూజిస్తూ



కలసిమెలసి సాగాలి
దైవ నామం స్మరిస్తూ

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# ఈడేపల్లిలో ఆక్సిజన్ సిలిండర్ లీకేజ్.. కాంక్రీట్ గోడను ఢీకొట్టి దూసుకెళ్లిన సిలిండర్

**రెండు బైక్‌లు, కారు ధ్వంసం.. ఒకరికి గాయాలు.. తృటిలో తప్పిన పెను ప్రమాదం జనావాసాల మధ్య గ్యాస్ షాపుపై స్థానికుల ఆగ్రహం.. రెండు రోజుల్లో తరలిస్తామని హామీ**








**మచిలీపట్నం ఆగష్టు 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం ఈడేపల్లిలోని బెల్ కంపెనీ వెనుక ప్రాంతంలో బుధవారం ఉదయం ఆక్సిజన్ సిలిండర్ లీకేజీ తీవ్ర కలకలం రేపింది. లీకేజీ కారణంగా అదుపుతప్పిన సిలిండర్ ఒక్కసారిగా దూసుకెళ్లి కాంక్రీట్ గోడను ఢీకొట్టడంతో గోడ ధ్వంసమైంది. సేకరించిన వివరాలు ప్రకారం ఈడేపల్లి లో ఉన్న అశ్విని ఎంటర్ప్రైజెస్ ఆక్సిజన్ గ్యాస్ సిలిండర్ ఇతర సిలిండర్లో అద్దెకి ఇస్తూ ఉంటారు. ప్రతిరోజు లాగానే షాపు బయట పెట్టి ఉన్న గ్యాస్ సిలిండర్లలో ఒకటి లీకేజ్ కావడంతో ఆ పరిసర ప్రాంతాల్లో లీకేజ్ గ్యాస్ సిలిండర్ లో విధ్వంసం సృష్టించాయి. ఆక్సిజన్ గ్యాస్ సిలిండర్ లీక్ కావటంతో సమీపంలో ఉన్న వాహనాలను ఢీకొనడంతో రెండు ద్విచక్ర వాహనాలు, ఒక కారు ధ్వంసమయ్యాయి. సిలిండర్ ప్రమాదకర స్థితిలో దూసుకెళ్లడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.అదే సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రాణనష్టం తప్పింది. నిత్యం ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్నారులు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయంలో ఇలాంటి ప్రమాదం జరగడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో సమ్మెట వెంకట కృష్ణమాచారి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. లీకవుతున్న ఆక్సిజన్ సిలిండర్‌ను అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు. సిలిండర్ లీకేజీతో భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉండటంతో పరిసర ప్రాంతాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం నేపథ్యంలో అశ్విన్ ఎంటర్ప్రైజెస్ ఆక్సిజన్ అండ్ స్పెషల్ గ్యాసెస్ షాపును జనావాసాల మధ్య నుంచి వెంటనే తొలగించాలంటూ స్థానికులు ఆందోళనకు దిగారు. షాపు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఇలాంటి ప్రమాదకర గ్యాస్ సిలిండర్ల వ్యాపారం జనావాసాల మధ్య నిర్వహించడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో షాపు యజమాని అద్దంకి వెంకయ్య నాయుడు స్పందించలేదని వారు ఆరోపించారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జనావాసాల నుంచి షాపును తక్షణమే తరలించాలని డిమాండ్ చేశారు.సిలిండర్ లీకేజీ ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ డీఎఫ్ఓ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును, సిలిండర్ లీకేజీ పరిస్థితిని, అక్కడి పరిసరాలను పరిశీలించారు. ఘటనకు దారితీసిన కారణాలపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. షాపును తొలగించాలంటూ స్థానికులు ఆందోళన కొనసాగిస్తున్న సమయంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న ప్రజలతో మాట్లాడారు. ప్రజల భద్రతకు ఇబ్బంది కలగకుండా షాపును ఆ ప్రాంతం నుంచి రెండు రోజుల్లో తొలగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఆయన హామీతో స్థానికులు ఆందోళన విరమించారు. ఈ ఘటనపై చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సిలిండర్ లీకేజీకి కారణాలు ఏమిటి? షాపులో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? జనావాసాల మధ్య ఆక్సిజన్, ఇతర ప్రత్యేక వాయు సిలిండర్ల నిల్వ, విక్రయానికి అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై విచారణ జరగాల్సి ఉంది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం పట్ల స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## యువత జ్ఞానం, ఏకాగ్రత, నైతిక విలువలతో ఉన్నప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలు సాధ్యం

**-ఆచార్య చివుకుల ఉష**



**శేరిలింగంపల్లి,ఆగస్టు 12 (వార్తాప్రభ):**అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా బీహెచ్ఈఎల్‌లోని శేరిలింగంపల్లి జూనియర్ కళాశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీందర్ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథి ఆచార్య చివుకుల ఉష మాట్లాడుతూ యువత జ్ఞానం, ఏకాగ్రత, నైతిక విలువలతో ముందుకు సాగినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు.ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని విద్య, ఉపాధి రంగాల్లో రాణించాలని సూచించారు. మద్యపానం, ధూమపానం,మాదకద్రవ్యాలు, సోషల్ మీడియా వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. యోగా,ధ్యానం, పౌష్టికాహారంతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.అనంతరం విద్యార్థులతో చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ జాతీయ సమైక్యత, సమగ్రతను కాపాడి దేశాభివృద్ధిలో భాగస్వాములమవుతామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మధుసూదనరావు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాలం శ్రీను, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## చౌడమ్మ తల్లి జయంతి వేడుకలు



**సంగం ఆగస్టు 12 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవి ఆలయాల్లో చౌడమ్మ తల్లి జయంతి సందర్భంగా వేడుకలు ఘనంగా జరిగాయి.రాళ్లచెలిక ప్రాంతం లో వెలిసియున్న బాల చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.అమ్మవారికి డిస్కో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ధర్మబోధకు వేదికగా చంద్రగిరి.. మహాభారత మహోత్సవాలకు ఏర్పాట్లు





**చంద్రగిరి, ఆగస్టు 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చంద్రగిరిలో శ్రీ మహాభారత మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించే ఒదుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సనాతన ధర్మ ప్రచారం, ఆధ్యాత్మిక చైతన్యం, భక్తిభావాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ మహోత్సవాలను ఆగస్టు 12 నుంచి 31వ తేదీ వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఆగస్టు 12న ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలతో మహోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం పగలు, రాత్రి వేళల్లో శ్రీమహాభారత కథా ప్రవచనాలు, హరికథలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.మహోత్సవాల్లో భాగంగా ఆగస్టు 13 నుంచి 30వ తేదీ వరకు ప్రతిరోజూ పగటి, రాత్రి కథా కార్యక్రమాలకు పలువురు దాతలు, ప్రముఖులు ఉభయదాతలుగా వ్యవహరించనున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన ఆధ్యాత్మికవేత్తలు, పండితులు, ప్రముఖులు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.ఆగస్టు 31న సోమవారం ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. మహోత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ధార్మిక కార్యక్రమాల్లో ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని శ్రీమహాభారత మహోత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## రైతులు తప్పనిసరిగా రైతు ఐడీ నమోదు చేసుకోవాలి

**ఈ నెల 17లోపు ప్రక్రియ పూర్తి చేయాలి: మండల వ్యవసాయ అధికారి శశిధర్**




**సంగం ఆగస్టు 12 (వార్తాప్రభ ప్రతినిధి)** పొలం ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా రైతు ఐడీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శశిధర్ సూచించారు.సంగం మండలం తరుణవాయలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో రైతులకు రైతు ఐడీ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.రైతు ఐడీ లేకపోతే రానున్న రోజుల్లో ఎరువులు పొందడం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించడం వ్యవసాయ శాఖ ద్వారా అమలయ్యే వివిధ ప్రభుత్వ పథకాలకు అర్హత పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు.అందువల్ల ప్రతి రైతు ఈ నెల 17వ తేదీలోపు తప్పనిసరిగా రైతు ఐడీ నమోదు చేసుకోవాలని సూచించారు. సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి అక్కడి వ్యవసాయ సహాయకుల సహకారంతో రైతు ఐడీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని శశిధర్ కోరారు. రైతులకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు వ్యవసాయ సేవలు సక్రమంగా అందేలా రైతు ఐడీ నమోదు కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మనోహర్ వీఏఏ శ్రావణి ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన జర్మనీ కాన్సుల్ జనరల్

**- వ్యాపార అనుకూలతలు, పెట్టుబడి అవకాశాల పరిశీలన**







**శ్రీసిటీ, ఆగస్టు 12 :(వార్తా ప్రభ ప్రతినిధి):**చెన్నైలోని జర్మనీ ఫెడరల్ రిపబ్లిక్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. కాన్సుల్ జనరల్‌తో చర్చల సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో శ్రీసిటీ అంతర్జాతీయ పెట్టుబడిదారులకు అనువైన వేదికగా ఎదిగిందన్నారు. బెల్ ఫ్లేవర్స్ & ఫ్రాగ్రెన్సెస్, నాఫ్, కాంక్యో బెర్ట్ వంటి జర్మన్ కంపెనీలు ఇప్పటికే శ్రీసిటీలో విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. జర్మనీ నుంచి మరిన్ని పెట్టుబడులకు ఈ పర్యటన దోహదపడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.శ్రీసిటీ సమగ్ర పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ ద్వారా ఒనగూరే వివిధ ప్రయోజనాలను కాన్సుల్ జనరల్ కు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పన్ను రాయితీలు, సబ్సిడీలతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న పెట్టుబడిదారుల అనుకూల విధానాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న '3ఎ' విధానం వేగం , స్థిరత్వం సేవలు ద్వారా ఆంధ్రప్రదేశ్ భారతదేశంలోనే అత్యంత ప్రాధాన్యమైన పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దబడుతున్నట్లు వివరించారు. ఇంకా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సమగ్ర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కూడా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.శ్రీసిటీ ప్రణాళిక, ఆధునిక మౌలిక వసతులు, వ్యాపార అనుకూల వాతావరణాన్ని మైఖేల్ హాస్పర్ ప్రశంసించారు. శ్రీసిటీ ఒక ప్రపంచస్థాయి పారిశ్రామిక నమూనాగా అభివర్ణించారు. జర్మనీకి భారత్ కీలక వాణిజ్య భాగస్వామిగా పేర్కొన్న ఆయన, భారతదేశంలో విస్తరిస్తున్న మార్కెట్, పెట్టుబడి అనుకూల ప్రభుత్వ విధానాలు ఇరు దేశాల మధ్య వాణిజ్య, పారిశ్రామిక సహకారానికి అపారమైన అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. తయారీ రంగానికే పరిమితం కాకుండా విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లోనూ భారత్--జర్మనీ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని హాస్పర్ పేర్కొన్నారు. ముఖ్యంగా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, విద్యా సంస్థలు--పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించడం ద్వారా ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.తన పర్యటనలో భాగంగా కాన్సుల్ జనరల్ శ్రీసిటీలోని పలు కీలక సదుపాయాలను సందర్శించారు. జర్మనీకి చెందిన నాఫ్ పరిశ్రమను సందర్శించి, అక్కడి సిబ్బందితో ముచ్చటించారు. ప్లాంట్‌లో ఉత్పత్తి కార్యకలాపాలు, ఇతర అంశాలను ఆయన పరిశీలించారు. ఈ పర్యటన భారత్--జర్మనీ మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగుగా నిలవడంతో పాటు అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రముఖ గమ్యస్థానంగా శ్రీసిటీని మరింత బలోపేతం చేయనుంది.

## అన్నా క్యాంటీన్లలో రుచికరమైన ఆహార పదార్థాలు అందించండి

**కమిషనర్ (ఎఫ్.ఏ.సి ) శారదా దేవి**





**తిరుపతి :ఆగస్టు 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నగరంలోని అన్నా క్యాంటీన్లలో పరిశుభ్రమైన, రుచికరమైన ఆహార పదార్థాలు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నగరంలోని స్విమ్స్ కూడలి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం తింటున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్నా కాంటీన్లను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. అన్నం వృథా చేయకుండా తగినంత తీసుకోవాలని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్క టోకెన్ మాత్రమే ఇవ్వాలని సూచించారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. ప్రజల నుండి ఎటువంటి పిర్యాదులు అందకుండా జాగ్రత్తగా శుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు. అన్నా కాంటీన్లలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు

## ఎల్ ని నో ప్రభావం - వాతావరణ మార్పులతో ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



**జగ్గయ్యపేట ఆగష్టు 12 (వార్తప్రభ)**ప్రస్తుతం ఎల్‌నినో బలపడే పరిస్థితులు, వాతావరణ మార్పుల ప్రభావంతో వర్షపాతం అస్థిరత, అధిక ఉష్ణోగ్రతలు, పొడి వాతావరణం, ఒక్కసారిగా భారీ వర్షాలు వంటి పరిణామాలు కనిపించే అవకాశం ఉందని ప్రతి రోజు వాతావరణ సంస్థలు హెచ్చరిస్తున్నాయి.ఆగస్టు 2026లో ఆంధ్రప్రదేశ్ లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.ఒక పక్క ఈ పరిస్థితులు ఉండగా మరో పక్క జగ్గయ్యపేట ప్రాంతం పారిశ్రామిక వాడగా దినదిన వృద్ధి చెందుతూ పర్యావరణం సైతం దెబ్బ తింటూ కాలుష్య కోరల్లో ప్రజలు కొట్టు మిట్టాడు తున్నారు. ఇటువంటి పరిస్థితులలో జగ్గయ్యపేట ప్రాంతంలో ఏ విధమైన ఆరోగ్యం సూచనలను పాటించాలి. ఇటువంటి ప్రభావం నుంచి జగ్గయ్యపేట ప్రాంత ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశంపై కాలుష్యాన్ని నివారించడానికి విరివిగా చెట్లను నాటి పెంచాలని,ప్లాస్టిక్ ని పూర్తిగా అరికట్టేలా ప్రతి ఒక్కరు గుడ్డ తో కూడిన చేతి సంచులను ఉపయోగించాలని,పెరుగుతున్న వాహనాల ఇంధన వాడకాన్ని తగ్గించేలా పట్టణ పరిధిలో తిరగటానికి ఆరోగ్యం కోసం సైకిల్ వాడకాన్ని పెంచుకోవాలి, చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పర్యావరణ ప్రేమికులు తెలియజేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడుకోవడం కోసం జగ్గయ్యపేట పట్టణం సి.హెచ్.సి ఇన్ ఛార్జ్ డాక్టర్ ఏ హరికృష్ణ మాట్లాడుతూ వాతావరణ మార్పులు నేరుగా మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేయవచ్చు.ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, బయట పనిచేసే కార్మికులు, గుండె--ఊపిరితిత్తులు--కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. అధిక వేడి వల్ల డీహైడ్రేషన్, హీట్ ఎగ్జాషన్, హీట్‌స్ట్రోక్ వంటి సమస్యలు రావచ్చు. ఎండ తీవ్రంగా ఉండే సమయంలో అవసరం లేని బయట ప్రయాణాలను తగ్గించాలి.తరచుగా నీరు తాగాలి, చెమట ఎక్కువగా పడితే ద్రవాలు, ఎలక్ట్రోలైట్లను తగిన విధంగా తీసుకోవాలి.పలుచని, వదులైన దుస్తులు ధరించి తలకు టోపీ/గొడుగు ఉపయోగించాలి.మధ్యాహ్నం వేళల్లో శారీరక శ్రమ, వ్యాయామం తగ్గించాలి.పిల్లలు, వృద్ధులు ఎక్కువసేపు ఎండలో ఉండకుండా చూడాలి.తలనొప్పి, తీవ్రమైన నీరసం, తల తిరగడం, గందరగోళం,స్పృహ తగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు.హీట్ స్ట్రోక్ అనుమానం ఉంటే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని,పరిసరాల పరిశుభ్రత,దోమలు పెరగకుండా చర్యలు,కాచి చల్లార్చిన నీటిని త్రాగడం,జంగ్ ఫుడ్ లు,నిల్వ ఉన్న ఆహారం తీసుకోకూడదని ఆయన సూచించారు.

## సుజాతనగర్ లో ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సుజాతనగర్ లో ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా నాయకులు కుమారి హనుమంతరావు ఆధ్వర్యంలో కుల్లగాని ప్రసాద్ స్తూపం వద్ద బుధవారం శ్వేత అరుణ పతాకాన్ని ఆవిష్కరణ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వతంత్రమే లక్ష్యంగా దేశ స్వతంత్రం మా జన్మ హక్కు అనే 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్లోని లక్నోలోని అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) ఆవిర్భించి మా అంతం చూసిన స్వతంత్ర ఉద్యమం పంతం వీడమంటూ దేశ స్వతంత్ర రణరంగా సంగ్రామ పోరాటంలో ఎంతోమంది యువ కిశోరాలను బలిదానం చేసిన ఏకీక విద్యార్థి సంఘం, అని అన్నారు నాటి నుంచి నేటి వరకు 90 సంవత్సరాలుగా దేశ సమగ్రతపై విద్యారంగా సమస్యలపై సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తున్న సంఘం ఏఐఎస్ఎఫ్ అని ప్రభుత్వ విద్య పరిరక్షణకై నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వతంత్రం కావాలి అనే బ్రిటీష్ సామ్రాజ్యవాదుల చెర నుంచి మాతృభూమి విముక్తికై 1936 ఆగస్టు 12న అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించి దేశ స్వతంత్రం ఉద్యమంలో అసమాన పోరాటాలు నిర్వహించి ఎంతో మంది విద్యార్థులను అమరవీరులయ్యారని వారి త్యాగాన్ని కొనియాడారు.

## నేడు పాడేరులో వన్ మంత్ వన్ విలేజ్ కార్యక్రమం

**రైతుల అర్జీలుకు సత్వర పరిష్కార మార్గం.. తహశీల్దారు ఆర్ మస్తానయ్య**

**చేజర్ల ఆగష్టు 12 (వార్తాప్రభ)** చేజర్ల మండలంలోని బొగ్గలవారి కండ్రికలో నేడు వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ కార్యక్రమంలో భాగంగా చేజర్ల మండల తహసీల్దారు ఆర్.మస్తానయ్య ఆధ్వర్యంలో సభా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ఆయా గ్రామ సంబంధిత రైతులు ప్రజలు వారి యొక్క సమస్యలను నేరుగా అర్జీ పూర్వకంగా విన్నవించుకోవచ్చని వారు తెలిపారు.వివిధ శాఖలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే వాటిని సత్వర కాలంలో పరిష్కరించే దిశగా చూస్తామని ఆయన పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.ఈ అవకాశాన్ని ఆ గ్రామంలోని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

## గాలిబ్ రావు 7 వ వర్ధంతి - సిపియం ఘన నివాళులు



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) ఉద్యమ నిర్మాణానికి నిస్వార్థంగా ప్రజా పోరాటాలు, పేదలకు ఇళ్ళు ఇళ్ళ స్థలాలు డాక్టర్ మోహన్ రావు నగర్, అంబేద్కర్ నగర్, పుట్లమగట్టు, ఇందిరమ్మ నగర్, కోటయ్య నగర్, అకువాని చెరువు, ల్యాంకో కార్మిక పోరాటం లాంటి సమస్య లోపై , కాలనీ పేదలకు ఇళ్ళు ఇళ్ళ స్థలాలు కోసం నిరంతరం కృషి చేసిన కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ సామల గాలిబ్ రావు అని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఎన్ సి హెచ్ శ్రీనివాస్ కొనియడారు. ప్రస్తుతం దేశంలో బిజెపి ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో గాని కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో గాని గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక న్యాయం, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయటంలో బిజెపి ప్రభుత్వం విధానాలు కార్పొరేట్ ప్రైవేటీకరణ తో తప్ప ప్రజా ప్రయోజనాల లేవు అని అంబానీ, అదానీ సేవ తప్పు - ప్రజా సేవ లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం 2 సంవత్సరాల కాలంలో ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మాజీ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వర రావు, జెవివి రాష్ట్ర నాయకులు పి కామేశ్వరరావు,కొండపల్లి సిపిఎం పట్టణ కార్యదర్శి ఎం మహేష్, సీనియర్ కామ్రేడ్ కామ్రేడ్ ఎ విఠల్ రావు, పట్టణ కమిటీ సభ్యులు ఇ కొండలరావు, కె బేబీ సరోజినీ, బడిషా వెంకటేశ్వరరావు, వై వెంకటేశ్వరరావు, పాపయ్య కామ్రేడ్ గాలిబ్ రావు సతీమణి కామ్రేడ్ వెంకట్రావమ్మ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పేరు మారిన బోర్డు మారలేదు

## విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం




**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12(వార్తా ప్రభ ప్రతినిధి):**జిల్లాల పునర్విభజన జరిగి చాలా కాలం అవుతున్న నిలువెత్తు నిర్లక్ష్యం తో విమర్శలు మూట కట్టుకుంటున్నారు.కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాలికోనత పాఠశాల ప్రధాన ముఖ ద్వారం వద్ద ఉన్న బోర్డులో ఇప్పటికీ కృష్ణాజిల్లా పేరే దర్శనమిస్తుంది.జిల్లా పరిషత్ విభజన జరగలేదేమో,అన్న సందేహంలో ఉన్నారేమో అధికారులు ఎన్టీఆర్ జిల్లాగా మార్చలేదు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు నిద్రలేచిపాఠశాల బోర్డు, ఆన్లైన్ వివరాలు తదితర అన్ని అధికారిక పత్రాల్లో జిల్లా పేరును సవరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు

### విజయవంతంగా ముగిసిన ఉచిత మెడికల్ క్యాంప్ -జనసేన పార్టీ నాయకులు

**నూజివీడు, ఆగస్టు 12 :(వార్తా ప్రభ ప్రతినిధి):** నూజివీడు అమెరికన్



హాస్పిటల్ మరియు నూజివీడు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు ముమ్మలనేని సునీల్ కుమార్ మరియు సూరిశెట్టి శివ సంయుక్త ఆధ్వర్యంలో నూజివీడు బాపు నగర్ లో ఉచిత మెడికల్ క్యాంప్ ఈరోజు మధ్యాహ్నం 3 గంటలు నుంచి రాత్రి 7 గంటలు వరకు విజయవంతంగా ముగిసింది పట్టణ ప్రజలు భారీ ఎత్తున్న వచ్చి వారి రుగ్మతలుకి టెస్ట్ లు చేయించుకుని మందులు కూడా ఉచితంగా తీసుకువెళ్లారు పట్టణ ప్రజలుకి ఎటువంటి అసౌకర్యం కలగకుండా జనసేన నేత ముమ్మలనేని సునీల్ కుమార్, సూరిశెట్టి శివ,రేపాని రాజు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు మధ్యాహ్నం 3 గంటలుకి ప్రారంభం అయ్యి రాత్రి 7 గంటలు వరకు జరిగింది. ఈ మంచి కార్యక్రమంకి జనసేన నాయకులు ముమ్మలనేని సునీల్ కుమార్ మరియు సూరిశెట్టి శివ మరియు అమెరికన్ హాస్పిటల్ డాక్టర్స్ బృందం హట్టహాసంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు మరియు ఇంత మంచి కార్యక్రమంని చేసిన నూజివీడు జనసేన పార్టీ నాయకులు ముమ్మలనేని సునీల్ కుమార్ పలువురు పార్టీ నాయకులు ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా హాజరయ్యిన అమెరికన్ డాక్టర్లు బృందం మా అమెరికన్ హాస్పిటల్ సీఈఓ అనిల్ కుమార్ ఆదేశాలు మేరకు మెడికల్ క్యాంప్ లుని పెడుతున్నాము అని కొన్ని వారంల నుండి నూజివీడు టౌన్ లలో వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నిర్వహించారు అని అలాగే ఈరోజు బాపు నగర్ లో కూడ క్యాంప్ నిర్వహించడం చాలా ఆనంద దాయకంగా ఉందని వారు మంచి సేవ గుణం ఉన్న వ్యక్తి అని ఇలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారు అని వారు ఎప్పుడు ఎక్కడ క్యాంప్ లు పెట్టాలి అనిన అమెరికన్ హాస్పిటల్ టీం సిద్దంగా ఉంటుంది అని డా. ప్రదీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గురించి ఎం సునీల్ కుమార్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో సేవ కార్యక్రమంలు చెయ్యడం ఆనవాయితీగా ఉందని అమెరుకన్ హాస్పిటల్ వారు మాకు అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తున్నారు. మెం ఎక్కడ ఎప్పుడు అడిగిన వారు మెడికల్ క్యాంప్ లు చేయుటకు చేయూత ఇస్తున్నారు అని వారి సేవ గుణాన్ని మాటలుతో వర్ణించలేనిది అని పేద మధ్య తరగతి ప్రజలకు వివిధ రుగ్మతలుతో వచ్చిన వారును ఎంతో ఓర్పుతో రోగులకు అన్ని పరీక్షలు చేసి వారికి ఉన్న రుగ్మతలుకి మంచిగా వైద్యం చేస్తున్నారు. మెం మెడికల్ క్యాంప్ లో ఇప్పటి వరకు దాదాపు 50 మంది దాకా ఉచితంగా కంటి ఆపరేషన్ లు చేయించడం ఆనందంగా ఉందని ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్తాము అని ఎక్కడ మెడికల్ క్యాంప్ పెట్టాలని అనిన నేను ముందు ఉండి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇస్తున్నాను నాకు సహకరిస్తున్న అమెరికన్ బృందానికి నా తరుపున మరియు జనసేన పార్టీ తరుపున ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ ఎప్పుడు ప్రజలుకి ఉపయోగకరమైన పనులు మాత్రమే చేస్తాం అని రానున్న రోజుల్లో ఇంకా పెద్దఎత్తున మెడికల్ క్యాంపులు పెట్టి ప్రజలుకి అండగా ఉంటాము అని నాకు అన్నివిదాల సహకరించిన అమెరికన్ హాస్పిటల్ డాక్టర్లు డా. జయవేదమని, డా. ప్రవీణ్,డా.శ్యామ్. డా.లక్ష్మి,డా.దీప్తి,డా బెన్నీ మోజెస్,డా. పృధ్వి కి మరియు స్టాఫ్ కి ప్రత్యేక అభినందనలు తెలియచేశారు. ఎల్లప్పుడూ సదా మీ సేవలో ఉంటానని అన్నారు.

# పోలీస్ వాహనాలపై సీపీ తనిఖీ!!

● వాహనాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి ● పోలీస్ వాహనాలు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి ● వాహనాల్లో భద్రతా సామగ్రి తప్పనిసరి ● పోలీస్ స్పందనా సామర్థ్యం పెంచాలి ● రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ





**పెద్దపల్లి/గోదావరిఖని, ఆగస్టు 12 (వార్తాప్రభ):**రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ వాహనాల పనితీరు, భద్రతా ప్రమాణాలపై కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ప్రత్యేక దృష్టి సారించారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్లకు చెందిన పోలీస్ స్టేషన్ల వాహనాలను బుధవారం కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో ఆయన స్వయంగా పరిశీలించారు. వాహనాల ప్రస్తుత స్థితి, నిర్వహణ విధానం, అత్యవసర సమయాల్లో వాటి అందుబాటును సమీక్షించారు. పోలీస్ సేవలకు వాహనాలు కీలకమైనందున ఏ సమయంలోనైనా వినియోగించుకునేలా సిద్ధంగా ఉంచాలని సూచించారు. వాహనాల్లో ఏర్పాటు చేసిన సమాచార ప్రసార పరికరాల పనితీరును కూడా సీపీ తనిఖీ చేశారు. ప్రతి వాహనంలో ప్రథమ చికిత్స పెట్టె, అత్యవసర దీపం, తాళ్లు, ట్రాఫిక్ కోన్లు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. నేరస్థల భద్రతకు అవసరమైన రక్షణ రిబ్బన్లు, హెల్మెట్లు, రక్షణ కవచాలు, లాఠీలు, బాడీ ప్రొటెక్టర్లు, రిఫ్లెక్టివ్ జాకెట్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది భద్రతకు అవసరమైన సామగ్రి విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. వాహనాల్లో కనిపించే చిన్నపాటి లోపాలను సైతం వెంటనే గుర్తించి మరమ్మతులు చేయించాలని సూచించారు. ప్రతి నెలా వాహనాలను సమగ్రంగా తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని మోటారు వాహనాల అధికారులను ఆదేశించారు. డ్రైవర్లు పోలీస్ వాహనాలను తమ సొంత వాహనాలుగా భావించి బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. ఇంజిన్ ఆయిల్ మార్పు, టైర్ల పరిస్థితి, బ్రేకులు తదితర అంశాల్లో నిర్ణీత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. వాహనాల నిర్వహణలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ పెడితే అత్యవసర సేవలను మరింత వేగంగా అందించవచ్చని తెలిపారు. డ్రైవర్లకు వాహన నిర్వహణ, భద్రతపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వాహనం సిద్ధంగా ఉండటం పోలీస్ స్పందనా సామర్థ్యాన్ని పెంచుతుందని అన్నారు. ప్రజలకు పోలీస్ సేవలు నిరంతరాయంగా అందేలా వాహన వ్యవస్థను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. పోలీస్ వాహనాల భద్రత, పనితీరుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

# మండల ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే





**పెనుగంచిప్రోలు - ఆగస్టు 12( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండలం తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం పాత సీని మాహాల్ సెంటర్ లోని ఆర్ కె పంక్షన్ హాల్ నందు బుధవారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య అధ్యక్ష తన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశం కు ముఖ్య అధితి గా ఎమ్మెల్యే శ్రీ రామ్ రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు,సమావేశం అనంతరం టీడీపీ నేతల ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ శ్రీ తిరుపతమ్మ ఆలయం వరకు నిర్వహించడం జరిగింది.17 మందికి రూ.13,02,554 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు బుధవారం నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పెనుగంచిప్రోలు మండలంలోని ఆర్.కె. ఫంక్షన్ హాల్లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే తాతయ్య అన్నారు. పార్టీ నాయకులతో పలు అంశాలపై చర్చించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించడం తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు.నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సూచించారు.అనంతరం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.సమావేశం అనంతరం పెనుగంచిప్రోలు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.13,02,554 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య స్వయంగా అందజేశారు.వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స, శస్త్రచికిత్సలు చేయించుకున్న బాధితులు తమ వైద్య ఖర్చుల వివరాలను స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే తాతయ్య దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వారి తరఫున ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫారసు చేసి, ఆర్థికసహాయంమంజూరయ్యేలా కృషి చేశారు.ఈ నేపథ్యంలో మంజూరైన చెక్కులను బాధితులకు అందజేశారలబ్ధిదారుల వివరాలు:తోటచర్ల గ్రామానికి చెందిన జవ్వాజీ లక్ష్మి 29,600. జడ స్వరాజ్యం 25,166. పోతవరపు నరసింహారావు 35,541. సుబ్బాయిగూడెం గ్రామానికి చెందిన శీలం శ్రీనివాసరావు 1,38,098. వడ్లమూడి శ్యామల 91,138. శివాపురం గ్రామానికి చెందిన ఏలూరి మోహనరావు 73,460. నవాబుపేట గ్రామానికి చెందిన ములుగు ఎలమందయ్య 2,58,470. ముండ్లపాడు గ్రామానికి చెందిన కొమ్మినేని నారాయణ 45,010. మాదల పావని 85,032. ముచ్చింతాల గ్రామానికి చెందిన ప్రత్తిపాటి స్వాతి 20,460. నెల్లూరి లక్ష్మీనారాయణ 23,795. నెల్లూరి నాగేంద్రమ్మ 21,084. పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన గింజుపల్లి సునీత 78,468. వెల్దుర్తిపాడు గ్రామానికి చెందిన బండి రామకృష్ణ 92,241. కొల్లికుళ్ళ గ్రామానికి చెందిన గుంటముక్కల శ్రీనివాసరావు 34,321. లింగగూడెం గ్రామానికి చెందిన మీర జస్వంత్ 67,758. అనిగండ్లపాడు గ్రామానికి చెందిన సయ్యద్ జాన్ మియా 1,82,912.ఈ సందర్భంగా లబ్ధిదారులు తమకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య కి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న మాజీ ఎం పిపి వేగినేటి గోపాల కృష్ణ మూర్తి. సోసైటీ అధ్యక్షులు కర్ల వెంకటనారాయణ. మాజీ జెడ్ పిటి సి లు కాకాని శ్రీనివాసరరావు. గజ్జి కృష్ణ మూర్తి.మాజీ సర్పంచ్ జే. సుదీర్ బాబు. తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి నలమోలు శివ రామ ప్రసాద్.పోలం పల్లి డ్యామ్ చైర్మన్ పొన్నం బాలాజీ. తిరుపతమ్మ ఆలయ చైర్మన్ చుంచు రమేష్ బాబు. దశరద రామయ్య. మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలి

**22.84 లక్షల వ్యయంతో నాలుగు అధునాతన డీజీపీఎస్ రోవర్లు**

**70 గ్రామాల్లో కొనసాగుతున్న భూముల రీసర్వే - జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీసర్వే కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో సర్వే పనులు కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసి, కచ్చితత్వంతో భూ సర్వే పనులు నిర్వహించేందుకు రూ.22.84 లక్షల వ్యయంతో నాలుగు అధునాతన డీజీపీఎస్ (ఐటూా) రోవర్లను జిల్లాకు సమకూర్చినట్లు తెలిపారు.జిల్లాలో ఇప్పటికే 17 డీజీపీఎస్ రోవర్లు అందుబాటులో ఉన్నాయని, రీసర్వే పనులను మరింత వేగవంతం చేసేందుకు తాజాగా మరో నాలుగు రోవర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ తెలిపారు . జిల్లాలో ప్రత్యేకంగా ఎంపిక చేసిన 70 గ్రామాల్లో లైసెన్సుడ్ సర్వేయర్ల ద్వారా భూముల రీసర్వే పనులు కొనసాగుతున్నాయని, సర్వే ప్రక్రియలో కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చిన నాలుగు డీజీపీఎస్ రోవర్లను వినియోగించనున్నట్లు తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో భూముల కొలతలను కచ్చితత్వంతో చేపట్టడంతో పాటు సర్వే పనులను వేగంగా పూర్తి చేయడానికి ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.ఈ సందర్భంగా బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో లైసెన్సుడ్ సర్వేయర్లకు జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా నాలుగు డీజీపీఎస్ రోవర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే పనుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని, నిర్దేశిత లక్ష్యాల మేరకు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సర్వేయర్లకు సూచించారు. భూ వివరాల నమోదు, భూముల కొలతలు, సరిహద్దుల నిర్ధారణ తదితర అంశాల్లో పూర్తి కచ్చితత్వంతో, పారదర్శకంగా సర్వే నిర్వహించాలని తెలిపారు. ప్రజలకు భూ సంబంధిత సమస్యలు తలెత్తకుండా రీసర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సర్వే ఏడీ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, లైసెన్సుడ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేతన్న నేస్తం వసూళ్ల ఆరోపణలు అవాస్తవం: కట్ట అంజిబాబు

**మచిలీపట్నం ఆగస్టు 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం పై చేనేత కార్మికులకు 25వేల రూపాయలు బ్యాంకు ఖాతాలో జమ చేశారు. అయితే ఈ విషయంలో 39 వ వార్డు చెందిన బాధ్యులు కొంతమంది లబ్ధిదారుల నుండి 2000 రూపాయల నుండి 5000 వరకు వసూలు చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి ఈ విషయమై పలువురు వ్యక్తం చేసిన 'నేతన్న నేస్తం... పథకంలో వసూల్ పర్వం' అనే శీర్షికతో వచ్చిన వార్తలో వాస్తవం లేదని డివిజన్ ఇన్చార్జ్ కట్ట అంజిబాబు అన్నారు.నేతన్న నేస్తం పథకం కింద లబ్ధిదారుల వద్ద నుంచి ఎలాంటి డబ్బులు వసూలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. తనపై గిట్టని వ్యక్తులు రాజకీయ లబ్ధి కోసం అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు.తాను నిత్యం ప్రజా సేవలో ఉంటూ, ప్రజల నుంచి ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించే వ్యక్తిని కాదని కట్ట అంజిబాబు స్పష్టం చేశారు.

## కొండ సత్యం సాగర్ ను పరామర్శించిన సిపిఐ నాయకులు



**జవహర్ నగర్, ఆగస్టు 12:(వార్తా ప్రభ)**కీసర సర్కిల్ జవహర్ నగర్ గిరి ప్రసాద్ నగర్ కాలనీసిపిఐ శాఖ కార్యదర్శి కొండా సత్యం సాగర్ కొద్ది రోజుల నుండి కాలు నొప్పితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకోవడం జరిగింది. ఆర్ వి ఎం హాస్పిటల్ లో చికిత్స చేసుకొని తన గృహానికి రావడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు కొండా సత్యం సాగర్ ని పరామర్శించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులుతోటపల్లి శంకర్, నిమ్మల నర్సింలు, ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి వి. వెంకటాచారి, సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, గిరిజన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి వి. స్వరూపనాయక్, కీసర మండల సహకార కార్యదర్శి వి. రవి నాయక్, కే. కురుమయ్య, కె. కుమార్, సూర్యం, పి. నరసింహ, డి. మల్లిక, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తి చాటిన విద్యార్థులు.. హర్ ఘర్ తిరంగా ర్యాలీ






**హనుమాన్ జంక్షన్, ఆగస్ట్ 12(వార్తాప్రభ)**మద్దాయిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామపంచాయతీ కార్యదర్శి చిలకపాటి చంద్రిక ఆధ్వర్య ంలో, ప్రధానోపా ధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు పర్యవేక్షణలో బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు, గ్రామ ప్రజలు చేతుల్లో జాతీయ పతాకాలు పట్టుకుని "వందేమాతరం.. భారత్ మాతాకీ జై.. మహనీయులందరికీ జోహార్లు" అంటూ నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా 'అను నేను' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ఉన్నతాధికారులు వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు సూచించారు. ప్రపంచంలో భారతదేశాన్ని ఉన్నత స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ తమ లక్ష్యం, ఆశయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఆగస్టు 10 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని గ్రామపంచాయతీ కార్యదర్శి చిలకపాటి చంద్రిక కోరారు.అనంతరం పాఠశాల విద్యార్థులు మానవహారంగా ఏర్పడి "ప్రపంచ శాంతి వర్ధిల్లాలి.. భారతదేశం ఎల్లప్పుడూ గౌరవ స్థానంలో నిలవాలి" అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ నాగరాజు, జే. పద్మ, బి. జాన్సన్‌తో పాటు గ్రామ మాజీ సర్పంచ్ వడ్డాది త్రినాధరావు, గ్రామ ప్రముఖులు వజ్ఞా రామారావు, వి. చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## దీనిబంధు కాలనీ పోచమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం



**కూకట్ పల్లి,ఆగస్ట్ 12(వార్తా ప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గం వెంకటేశ్వర నగర్ డివిజన్ లోని దీనబంధు కాలనీలో పోచమ్మ, మైసమ్మ దేవస్థానం వద్ద వెంకటేశ్వర శెట్టి ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య ను పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దాతలు చిరంజీవి,బసవరాజు,డేవిడ్ చిన్నారావు, చరణ్, కుమార్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అమావాస్యకు దీనిబంధు కాలనీలో అన్నదాన కార్యక్రమం చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక ప్రగతికి మార్గదర్శిగా శ్రీసిటీ

- 18 ఏళ్ల సుస్థిర ప్రగతి ప్రస్థానం
- రూ.53 వేల కోట్లకు పైగా పెట్టుబడులు, 75 వేలకు పైగా ఉద్యోగాలు
- దేశంలోని ఏసీల తయారీ కీలక కేంద్రంగా శ్రీసిటీ







**శ్రీసిటీ, ఆగష్టు 12 (వార్తాప్రభ) :** దక్షిణ భారతదేశంలో ఒక పారిశ్రామిక విప్లవానికి నాందిగా మొదలైన 'శ్రీసిటీ', నేడు 18 వసంతాలను పూర్తి చేసుకుని, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో అంతర్జాతీయ పారిశ్రామిక హబ్‌గా ఎదిగింది. రాష్ట్రానికి తలమానికంగా, దేశ పారిశ్రామిక ప్రగతికి మార్గదర్శిగా సుస్థిర అభివృద్ధి సాధించింది. దేశ విదేశాల బ్యూరోకాట్లు, వ్యాపార ప్రతినిధులు, విద్యావేత్తలు అధ్యయనం చేసే ఉత్తమ మోడల్‌గా కీర్తి గడించింది. 8 వేలకు పైగా ఎకరాల్లో విస్తరించి ఉన్న శ్రీసిటీలో ప్రస్తుతం 31 దేశాలకు చెందిన 260కుపైగా దేశ విదేశీ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. తద్వారా రూ.53 వేల కోట్లకు పైగా పెట్టుబడులు, రూ.57,500 కోట్లకు పైగా ఎగుమతులు నమోదుకాగా, 75 వేల మందికిపైగా ప్రత్యక్ష ఉపాధి లభించింది. ఎయిర్ కండిషనర్లు, ఆటోమొబైల్స్, మెట్రో కోచ్‌లు, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్, ఆహార ప్రాసెసింగ్, వినియోగ వస్తువుల తయారీలో శ్రీసిటీ దేశంలో ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా నిలిచింది. డైకిన్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, ఇసుజు, ఆల్స్టమ్, మోండెలీజ్, కోల్‌గేట్, కెలాగ్స్, కింబర్లీ-క్లార్క్ వంటి అంతర్జాతీయ సంస్థలు ఇక్కడి నుంచి దేశీయ, విదేశీ మార్కెట్లకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నాయి. సముద్ర తీర పోర్టులు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఎస్ఈజెడ్, ఎఫ్‌టిడబ్ల్యూజెడ్, ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్ వంటి మౌలిక సదుపాయాలు శ్రీసిటీ అభివృద్ధికి బలంగా నిలిచాయి.

**కూల్ క్యాపిటల్‌గా మరింత పటిష్టం..** ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, ఓజీ ఇండియా ప్యాకేజింగ్, సోలమ్ వంటి సంస్థల కొత్త పెట్టుబడులు, విస్తరణలతో శ్రీసిటీ దేశంలోని లి"కూల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా"గా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. ఇప్పటికే డైకిన్, బ్లూ స్టార్, క్యారియర్, హావెల్స్ లాయిడ్, అంబర్, ఈప్యాక్ డ్యూరబుల్ సహా 10 ప్రధాన ఏసీ తయారీ సంస్థలు, 30కుపైగా విడిభాగాల తయారీ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 2027 నాటికి దేశంలో తయారయ్యే ఎయిర్ కండిషనర్లలో దాదాపు 60 శాతం శ్రీసిటీ నుంచే ఉత్పత్తి అవుతాయని అంచనా.

**విద్యా హబ్‌గా కొత్త అడుగు..** క్రియా, ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీలు, ఐఎఫ్ఎంఆర్ బిజినెస్ స్కూల్, చిన్మయ, అకార్డ్ సిబిఎస్ఈ స్కూల్స్ ఏర్పాటుతో విద్యా కేంద్రంగా కూడా విరాజిల్లుతున్న శ్రీసిటీలో 'వర్క్-స్టడీ' డ్యూయల్ మోడల్ ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి ఆధారిత విద్యకు ప్రాధాన్యం మరియు పరిశ్రమలతో విద్యను అనుసంధానిస్తూ శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఈ ఏడాది ప్రారంభించడం అభివృద్ధిలో మరో మైలురాయి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన కోర్సులు భవిష్యత్ ఉద్యోగావకాశాలకు బాటలు వేయనుంది.

**సామాజిక సేవా కార్యక్రమాలకు పెద్దపీట..** పారిశ్రామిక ప్రగతితో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి శ్రీసిటీ నిరంతరం కృషి చేస్తోంది. 2009లో ప్రారంభమైన శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా 40కి పైగా పారిశ్రామిక భాగస్వాముల సహకారంతో ఇప్పటివరకు రూ.61 కోట్లకు పైగా సీఎస్ఆర్ నిధులను విద్య, వైద్యం, మౌళిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ తదితర రంగాల్లో వినియోగించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, వైద్య శిబిరాలు, తాగునీరు, పారిశుధ్య సదుపాయాల కల్పన, వృత్తి నైపుణ్య శిక్షణ, కమ్యూనిటీ లైబ్రరీల ఏర్పాటు, పచ్చదనం, జలవనరుల పునరుద్ధరణ వంటి అనేక కార్యక్రమాలను ఫౌండేషన్ చేపట్టింది. ఇప్పటివరకు 5,000 మందికి పైగా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అందించింది. ఈ కార్యక్రమాల ద్వారా జీవనోపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు మహిళా సాధికారత, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, సామాజిక అంశాల్లోనూ సానుకూల మార్పులు చోటుచేసుకున్నాయి.

**విస్తరణతో లక్ష్యం దిశగా..** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీసిటీ విస్తరణకు అదనంగా 2,000 ఎకరాలను కేటాయించడంతో, ప్రపంచ స్థాయి పోటీతత్వాన్ని, సామాజిక సమ్మిళిత అభివృద్ధిని, పర్యావరణ బాధ్యతను సమన్వయం చేస్తూ భారతదేశంలో తదుపరి దశ తయారీ రంగ ఆధారిత వృద్ధికి శ్రీసిటీ ఒక ఆదర్శ నమూనాగా నిలుస్తోంది. నేడు గ్లోబల్ పారిశ్రామిక శక్తికేంద్రంగా ఎదిగిన శ్రీసిటీ, ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తికి అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశ పారిశ్రామిక భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించే దిశగా పయనిస్తోంది.

**పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్య గమ్యస్థానంగా మార్చేందుకు కృషి.. (డా. రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్)..** ఈ ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే దూరదృష్టితో 18 ఏండ్ల క్రితం శ్రీసిటీకి శ్రీకారం చుట్టాం. నేడు ఇది ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన తయారీ కేంద్రంగా ఎదిగి, భారతదేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. పెట్టుబడిదారులు మాపై ఉంచిన విశ్వాసం, మా ఉద్యోగుల అంకితభావం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారం దీనికి తోడ్పాటు అందించాయి. మున్ముందు కూడా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనకు కట్టుబడి, ప్రపంచ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను అత్యంత ప్రాధాన్య గమ్యస్థానంగా తీర్చిదిద్దడంలో శ్రీసిటీ తన వంతు పాత్రను మరింత బలోపేతం చేస్తుంది. అలాగే పారిశ్రామిక వృద్ధితో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి చేయడం మా ప్రాధాన్యత. నిరంతర సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా దీనిని ముందుకు తీసుకువెళతాం.

**వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసిటీలో రక్తదాన శిబిరం..** ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా శ్రీసిటీ 18 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి ఎన్టీఆర్ ట్రస్ట్ సహకారంతో శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీసిటీ బిజినెస్ సెంటర్ లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన శిబిరంలో పలు పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు 325 మంది రక్తదానం చేశారు. యాక్సెలెంట్ ఫార్మా, టీఐఎల్ హెల్త్‌కేర్, ఎన్‌జీసీ, టీఎచ్‌కే, రాక్‌వర్త్, బ్రేక్స్ ఇండియా తదితర పరిశ్రమల ఉద్యోగులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. శిబిరంపై విశేష స్పందన రావడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడేందుకు ఎంతో ముఖ్యమైన రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన దాతలను అభినందిస్తూ, వారికి ప్రశంసా పత్రాలను అందచేశారు.

## సాయికృష్ణ కేసులో బెయిల్ పై కౌంటర్ వాయిదా

**విజయవాడలీగల్,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో జ్యుడిషియల్ రిమాండ్‌లో వున్న ఎ5 కైతేపల్లి బాబూరావు, ఎ6 గొరిపర్తి సాంబయ్యల తరపున న్యాయవాది జి.సాంబశివరావు దాఖలు చేసిన బెయిల్ పిటీషన్‌పై విచారణ నిమిత్తం 8వ అదనపు జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి ఈనెల 18వ తేదీకి... అలాగే మరో యిరువురు నిందితులు పోతర్లంక అశోక్‌కుమార్, జంగం నాని తరపున దాఖలైన బెయిల్ పిటీషన్లపై ప్రాసిక్యూషన్ న్యాయవాదులకు నోటీసులు జారీచేయాలని ఆదేశిస్తూ గురువారానికి న్యాయమూర్తి వాయిదా వేశారు. ఎ1 నిందితుడు మాజీ సిఐ నాగరాజు బెయిల్ పిటీషన్ దాఖలు చేసిన విషయం విదితమే.

## కృత్తివెన్నులో హర్ ఘర్ తిరంగ-- దేశభక్తి స్ఫూర్తితో తిరంగా ర్యాలీ... పాల్గొన్న ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షుడు..



**కృత్తివెన్ను,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలం కృత్తివెన్ను గ్రామంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అలాగే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు యువత మరియు గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని జాతీయ జెండాను చూపిస్తూ దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా కృత్తివెన్ను సెంటర్ లో జాతీయ జెండాలతో నిర్వహించిన తిరంగా ర్యాలీ దేశభక్తి భావనను మరింత పెంపొందించింది. జాతీయ ఐక్యత సమగ్రత దేశభక్తి జాతీయ జెండాపై గౌరవం వంటి గొప్ప విలువలను ప్రజల్లో చాటిచెప్పేలా కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ చైర్మన్, కృష్ణాజిల్లా అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి హాజరై తిరంగా ర్యాలీని ప్రారంభించారుఈ కార్యక్రమం లో కూటమి నాయుకులు తదితరులు పాల్గొన్నారు

## ఖరీదైన వైద్యం భారం కాకూడదనే ముఖ్యమంత్రి సహాయనిధి-లంక లితీష్

- కోడి రెక్కల చంద్రశేఖర్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.05 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఎల్‌ఓసీని అందజేసిన టీడీపీ నాయకులు



**మైలవరం,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** ఖరీదైన వైద్యం భారం కాకూడదనే ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేస్తున్నట్లు తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ అన్నారు. మైలవరం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం కోడి రెక్కల చంద్రశేఖర్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.05 లక్షల ఎల్‌ఓసీని లితీష్ స్థానిక టీడీపీ నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఖరీదైన వైద్యం అవసరమైన సందర్భాల్లో ఈ నిధులు బాధిత కుటుంబాలకు ఎంతో భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ చారుగుండ్ల ప్రసాద్, మాజీ ఎంపీటీసీ జల్లి కృష్ణ, షేక్ బాజీ, షేక్ షహనా బేగం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నేషనల్ లైబ్రేరియన్స్ డే



**విజయవాడ,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** స్థానిక మహాత్మా గాంధీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ముఖ్య అతిథి ఎం.ఎస్ బేగ్ పాల్గొనట జరిగినది. నేషనల్ లైబ్రేరియన్స్ డే సందర్భంగా డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథం జన్మదినాన్ని పురస్కరించి ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ముందుగా లైబ్రరీఎన్స్ నీ ఘనంగా సత్కరించటం జరిగినది.. . సిద్దార్థ మహిళా కాలేజ్ లైబ్రేరియన్ మల్లికా, లయోలా కాలేజ్ లైబ్రేరియన్ రోజా, ఠాగూర్ గ్రంథాలయ లైబ్రేరియన్స్ కే రమాదేవి గ్రేడ్ వన్ జి ఉమారాణి రాణి గ్రేడ్ 2 , ధనలక్ష్మి గ్రే గ్రేడ్ 3, డి నాగేశ్వరరావు గ్రేట్ 3 లైబ్రరీఎన్స్ దుస్సాలువాతో సత్కరించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ పాలకుల సేవలను కొనియాడారు. అలాగే పద్మశ్రీ ఎస్ సర్ రంగనాథన్ పుస్తకాన్ని పాటకుడి దగ్గరకు పాటకుడుని జ్ఞానం దగ్గరకు తీసుకువెళ్లిన మహనీయుడు ఎస్సార్ రంగనాథన్. ఆయనను భారత దేశ గ్రంథాలయ శాస్త్ర పితామహుడుగా గౌరవిస్తారు. 1931 లో అయినా ప్రసిద్ధ గ్రంథం 5 లాక్స్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ అనే పుస్తకాన్ని ప్రచురించారు. అధ్యయనం కొరకు పుస్తకం, ప్రతి చదువరికి ఒక పుస్తకం, ప్రతి పుస్తకానికి ఒక చదువరి, చదువరి సమయం వృధా చేయరాదు,గ్రంథాలయం ఒక అభివృద్ధి చెందుతున్న జీవం వంటిది పుస్తకాలు పాఠకులు సాంకేతిక సేవలు కాలానుగుణంగా పెరుగుతూ మారుతూ ఉండాలనీ ఐదు సూత్రాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గంటలో LOC అందించిన మంత్రివర్యులు

- సుమారు రూ.6లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి LOC పత్రాన్ని బాధిత కుటుంబాలకు అందజేసిన రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్ధసారథి



**నూజివీడు,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** నూజివీడు పట్టణానికి చెందిన ఎ,సుందరీ మెరుగైన వైద్యానికి సుమారు. రూ.1.46.766విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి నాజ చెక్కును,మరియు ప్రగడవరం గ్రామానికి చెందిన ఆర్, శ్రావణి మెరుగైన వైద్యానికి సుమారు. రూ.4.54.993లక్షల LOC చెక్కును ఇరువురికి సుమారు.6లక్షల చెక్కులను అందజేసిన మంత్రివర్యులు కొలుసు పార్ధసారథి. మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవని వంటిదని అన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.సంజీవని ద్వారా గ్రామంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేసి ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదని. కాని కూటమి ప్రభుత్వంలో నూజివీడు నియోజకవర్గ ములో ఇప్పటి వరకూ సుమారు.రూ15కోట్లు విలువైన ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులు అందించామన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలోని మెరుగైన వైద్యం కోసం మెరుగైన వైద్య పరికరాల ఏర్పాటుకు వేలకోట్ల ఖర్చు చేసిందని తద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్య భద్రతతో సంతోషంగా ఉన్నారన్నారు. LOC అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు అడిగిన వెంటనే మా బాధను మా ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని గంటల వ్యవధిలో మెరుగైన వైద్యానికి సుమారు. రూ.6 లక్షలు అందించిన మంత్రివర్యులకు జీవితాంతం రుణపడి ఉంటామని ఇరుకుటుంభాలుతమ కృతజ్ఞతను హర్షాన్ని వ్యక్తం చేశారు.

## గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాన్నదే లకిరెడ్డి హనిమి రెడ్డి సంకల్పం

- సమాజ సేవ పట్ల హనిమి రెడ్డి కి ఉన్న తపనవల్లే డిగ్రీ కళాశాల రూపుదిద్దుకుంది
- ఎల్ హెచ్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన ప్రవాస భారతీయులు జయప్రకాశ్ రెడ్డి





**మైలవరం,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాన్నదే లకిరెడ్డి హనిమి రెడ్డి సంకల్పమని, ఆయనకున్న దూరదృష్టి,సమాజ సేవ పట్ల ఉన్న తపనవల్లే డిగ్రీ కళాశాల రూపుది ద్దుకుందని డా.లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ దాత డా.లకిరెడ్డి హనిమిరెడ్డి సోదరుడు లకిరెడ్డి జయప్రకాశ్ రెడ్డి వెల్లడించా రు.బుధవారం జయప్రకాశ్ రెడ్డి హైదరాబాద్ కు చెందిన 'రాధికా చారిటబుల్ ట్రస్ట్' ప్రతినిధులతో కలిసి మైలవరం పట్టణ శివారు డా.లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.మాధవి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ నతన సోదరుడు డా.లకిరెడ్డి హనిమిరెడ్డి మైలవరం లాంటి మారుమూల ప్రాంతంలో సర్వాంగ సుందరమైన, అన్ని వసతులు కలిగిన ఈ కళాశాలను స్థాపించడం గర్వంగా ఉందన్నారు.ఇక్కడి నుంచి చదువుకున్న వేలాది మంది విద్యార్థులు అత్యుత్తమ నైపుణ్యాలు సాధించి, వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాల్లో ఉన్నత ఉద్యోగాలు పొందుతుండటం ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. హైదరాబాద్ లోని రాధికా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాధిక మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు తాము ఎంచుకున్న ప్రయాణంలో ఎన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ, మొక్కవోని ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు.కుటుంబ వ్యవస్థకు స్త్రీయే మూలస్తంభం అనీ,ఒక ఇంట్లో స్త్రీ చదువుకుంటే ఆ కుటుంబమంతా విద్యా వెలుగులతో వికసిస్తుందన్నారు. విద్య కేవలం ఉద్యోగం కోసమే కాకుండా మనిషిని ఉన్నత వ్యక్తిగా తీర్చి దిద్దడానికి ఉపకరిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ డా. ఎస్.మాధవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడంలో లకిరెడ్డి హనిమి రెడ్డి దాతృత్వం మరువలేనిదన్నారు.విద్యార్థులు ఈ వసతులను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.అనంతరం కళాశాలలోని ప్రాంగణం, సైన్స్ ప్రయోగశాలలు (Labs), డిజిటల్ తరగతి గదులు మరియు లైబ్రరీని దాతలు పరిశీలించి, కళాశాల అభివృద్ధి పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు.భవిష్యత్తులో కూడా విద్యార్థుల ప్రతిభ ప్రోత్సాహకానికి, మౌలిక వసతుల కల్పనకు తమవంతు సహకారం అందిస్తామని దాతలు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జోగి రమేష్ ముందస్తు బెయిల్ పై విచారణకు వాయిదా

**విజయవాడలీగల్,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** జోగి రమేష్ కుటుంబం తనపై అదనపు వరకట్నం, హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ ఆయన కోడలు మేఘన ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసిన విషయం విదితమే. ఈ కేసులో జోగి రమేష్, జోగి రాము, సోదరి రమా సహా 11 మంది కుటుంబసభ్యులను నిందితులుగా చేర్చుతూ పోలీసులు హత్యాయత్నం, గృహహింస, వరకట్న నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల క్రింద కేసు నమోదుచేశారు. దీనిపై తమను అరెస్టు నుండి రక్షణ కోరుతూ జోగి రమేష్ కుటుంబం తరపున సీనియర్ న్యాయవాదులు చోడిశెట్టి మన్మథరావు, ఆదాంకుమార్ విజయవాడలోని మహిళా సెషన్స్ కోర్టులో పిటీషన్లు దాఖలు చేశారు. పిటీషన్లపై విచారించిన న్యాయస్థానం ఇబ్రహీంపట్నం పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. ఈ కేసులో మేఘన తరపున సీనియర్ న్యాయవాది కిలారు బెనర్జీ బుధవారం ఇంప్లీడ్ పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ కూడా అభ్యంతరం లేదని చెప్పడంతో కేసు విచారణను ఈనెల 17వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయమూర్తి, అప్పటివరకు జోగి రమేష్, అతని కుటుంబసభ్యులను అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులిచ్చారు.

## బీసీ ల ఆత్మబంధు కృష్ణ యాదవ్ జన్మదినోత్సవ వేడుకలు

### జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అభిమానులు





**మచిలీపట్నం,ఆగష్టు 12 (వార్తాప్రభ) :** బీసీల ఆత్మబంధువు యాదవ ప్రముఖుడు ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ యాదవ్ జన్మదినోత్సవ వేడుకలు బుధవారం అభిమానులు శ్రేయోభిలాషుల మధ్య ఘనంగా జరిగాయి. గొడుగు పేటలోని ఆయన స్వగృహంలో జరిగిన ఈ వేడుకలకు బందరు పెడన గుడివాడ గన్నవరం కైకలూరు నూజివీడు పామర్రు పెనమలూరు తదితర ప్రాంతాల నుంచి అభిమానులు భారీ ఎత్తున తరలివచ్చారు. శాలువాలు పూలదండలతో కృష్ణను ముంచేత్తారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు బిసి నాయకులు కృష్ణను శాసనమండలి సభ్యునిగా చూడాలన్న కోరికను వ్యక్తపరిచారు. త్వరలోనే ఆ కోరిక నెరవేరే విధంగా సామాజికపరంగా బలాన్ని చూపించవలసిన అవసరం ఏర్పడిందన్నారు. రానున్న రోజుల్లో 25 వేల మంది యాదవులతో జిల్లాలో భారీ సభను ఏర్పాటు చేసేందుకు యాదవ ప్రముఖులు నిర్ణయించారు. ఇందుకోసం పల్లపాటి చినబాబు అధ్యక్షునిగా మరో పదిమందితో యాదవ హక్కుల సాధన సమితిని కూడా ఏర్పాటు చేశారు. కృష్ణ యాదవ్ మాట్లాడుతూ తన పుట్టినరోజుకు వచ్చి శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188